RNI : APTEL/25/A0108

www.mahinewsindia.com

# మహి న్యూస్

తెలుగు దినపత్రిక

epaper: https://epaper.mahinewsindia.com

విలేకరులు కావలెను

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 02 సంచిక : 27, ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, పేజీలు : 8, వెల రూ. 2, /- గురువారం - 30 - ఏప్రిల్ - 2026

published From : YSR Kadapa. circulated by Kurnool I Anantapuram I Chitoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad and Telangana



## నేడు ఏపీ టెన్త్ ఫలితాలు.. మంత్రి నారా లోకేశ్ ప్రకటన

- నేడు ఉదయం 11 గంటలకు ఏపీ పదో తరగతి ఫలితాల విడుదల
- ఫలితాలను ప్రకటించనున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- అధికారిక వెబ్‌సైట్, వాట్సాప్, యాప్ ద్వారా ఫలితాలు తెలుసుకునే అవకాశం
- ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా పరీక్షలు రాసిన 6.30 లక్షల మంది విద్యార్థులు

## పవన్ కల్యాణ్‌తో నేను బాగానే ఉన్నా..

# అతిగా ప్రవర్తిస్తే సహించేదిలేదు

## టీడీపీ నేతలకు చంద్రబాబు వార్నింగ్

- ★ అధికారం ఉందని ఇగోలకు పోవద్దు.. సొంత పార్టీ నేతలకు చంద్రబాబు హెచ్చరిక
- ★ సొంత బాబాయిని చంపి నెపం మనపై నెట్టారని వైసీపీపై తీవ్ర విమర్శలు
- ★ జనసేన, బీజేపీతో సమన్వయం అవసరం.. కేంద్రంతో గ్యాప్ రాకూడదని స్పష్టీకరణ
- ★ ఫ్లెక్సీలు, కుర్చీల కోసం గొడవలు పడొద్దని కార్యకర్తలకు హితవు
- ★ త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం



అమరావతి: టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు సొంత పార్టీ నేతలకు, కార్యకర్తలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అధికారం వచ్చిందన్న అహంతో ఎవరూ ఇగోలకు పోవద్దని, క్రమశిక్షణ తప్పితే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. టీడీపీ కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు.. పార్టీ నేతలు, కార్యకర్తల ప్రవర్తనపై కీలక సూచనలు చేస్తూనే, మిగతా.. 2లో

## టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నారా లోకేశ్ ప్రమాణస్వీకారం

నారా లోకేశ్ చేత ప్రమాణస్వీకారం చేయించిన చంద్రబాబు

ప్రమాణస్వీకారం చేసిన పొలిట్ బ్యూరో, ఇతర కమిటీల నేతలు

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమం



అమరావతి: తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా యువనేత, మంత్రి నారా లోకేశ్ ప్రమాణస్వీకారం చేశారు. మిగతా.. 2లో



## యూపీ అభివృద్ధికి కొత్త జీవనాడి.. రూ. 36,230 కోట్లతో గంగా ఎక్స్‌ప్రెస్‌వే.. జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ

- ★ ఉత్తరప్రదేశ్‌లో గంగా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించిన ప్రధాని మోదీ
- ★ రూ. 36,230 కోట్ల వ్యయంతో 594 కిలోమీటర్ల పొడవున 6 లేన్ల రహదారి నిర్మాణం
- ★ మీరట్-ప్రయాగ్‌రాజ్ మధ్య ప్రయాణ సమయం 12 గంటల నుంచి 6 గంటలకు తగ్గింపు
- ★ యూపీ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు కొత్త జీవనాడిగా మారుతుంది

ఢిల్లీ: ఉత్తరప్రదేశ్ అభివృద్ధికి కొత్త జీవనాడిలా మారే గంగా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభిం చారు. హర్దోయ్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో, సుమారు రూ. 36,230 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ఆయన జాతికి అంకితం చేశారు. గంగా మాత పరిసర ప్రాంతాల గుండా వెళ్లే ఈ ప్రాజెక్టు ఉత్తరప్రదేశ్ మిగతా.. 2లో

## యుద్ధంలో శత్రువులకు తలొంచవద్దని ఇరాన్ పోస్టు

ఇరాన్ ఎంబసీ పోస్టు.. రాయబారికి యూకే సమన్లు



దేశాన్ని శత్రువులకు అప్పగించే బదులు ప్రాణాలు అర్పిద్దామని పిలుపు

ఇరాన్ ఎంబసీ చేసిన పోస్టు ఆందోళనకరమైనదనే అభిప్రాయాలు

రాయబారికి సమన్లు జారీ చేసిన యూకే ప్రభుత్వం

## మోదీ హైదరాబాద్ సభకు 'జనాగ్రహ సభ'గా నామకరణం

### మే 10న తెలంగాణలో పర్యటించనున్న మోదీ

- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగసభ
- 3 లక్షల మందిని సభకు తరలించే లక్ష్యంలో బీజేపీ శ్రేణులు




హైదరాబాద్ : మే 10వ తేదీన ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటంచనున్నారు. కేంద్రంలో మూడోసారి బాధ్యతలు చేపట్టిన మిగతా.. 2లో



## రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ

- కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ చెప్పిందొకటి, అధికారంలోకి వచ్చాక చేస్తోంది ఒకటని విమర్శ
- వరిధాన్యం కుప్పలు తెప్పలుగా వస్తున్నా కొనుగోళ్లు ప్రారంభించలేదని విమర్శ
- సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే



## తెలంగాణలో ఆస్తుల రిజిస్ట్రేషన్ భారం..

- మే మొదటి వారం నుంచి కొత్త విలువలు అమలు!
- తెలంగాణలో పెరగనున్న ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువలు
- మే మొదటి వారం నుంచి కొత్త రేట్లు అమల్లోకి వచ్చే అవకాశం
- ప్రభుత్వ ఆదాయం పెంచుకునేందుకే ఈ నిర్ణయమన్న కేబినెట్ ఉపసంఘం

## బీజేపీ రిగ్గింగ్‌కు పాల్పడుతోంది, ఈసీ అధికారులు ఉగ్రవాదుల్లా ప్రవర్తిస్తున్నారు: మమతా బెనర్జీ



భవానీపూర్ నియోజకవర్గాలో తారసపడిన మమతా బెనర్జీ, సువేందు అధికారి

కేంద్ర బలగాలు కార్యకర్తల ఇళ్లలోకి జొరబడి ఓటర్లను భయపెడుతున్నాయన్న మమతా బెనర్జీ

బీజేపీ, ఈసీ ప్రజాస్వామ్య పండుగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారని విమర్శ



## రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు దానవీరశూరకర్ణ, ఎన్నికల తర్వాత కుంభకర్ణ

- రేవంత్ రెడ్డి తాను మారిన మనిషినని చెబుతున్నారన్న కేటీఆర్
- ఎన్నికల తర్వాత కుంభకర్ణుడయ్యాడు కాబట్టి ఆయన చెప్పింది నిజమేనని చురక
- ఈ దుర్మార్గపు పాలనను మరొక్క సంవత్సరం తట్టుకోవాలన్న కేటీఆర్

హైదరాబాద్: తాను మారిన మనిషినని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నారని, అయితే ఆయన చెప్పినదాంట్లో నిజం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నికలకు ముందు ఆయన దానవీరశూరకర్ణ అయితే, ఎన్నికల తర్వాత కుంభకర్ణుడు అయ్యాడని ఎద్దేవా చేశారు. మిగతా.. 2లో

## ఆందోళన వద్దు, నిల్వలు సరిపడా ఉన్నాయి

# ప్రజలకు ప్రభుత్వం భరోసా

### అసాధారణ డిమాండ్ కారణంగా బంకుల్లో ఖాళీ అవుతున్న స్టాక్

- తెలంగాణలో పెట్రోల్, డీజిల్ కొరతపై ప్రభుత్వం క్లారిటీ.. అసలు కారణం ఇదేనన్న మంత్రి ఉత్తమ్
- ధరల పెరుగుదల వదంతులతోనే రాష్ట్రంలో ఇంధన కొరత ఏర్పడిందన్న మంత్రి
- సరఫరాను 126 శాతానికి పెంచి పరిస్థితిని చక్కదిద్దుతున్నామన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి
- రైతులకు, లారీ యజమానులకు ఇబ్బందుల్లేకుండా ప్రత్యేక చర్యలు



హైదరాబాద్: తెలంగాణలో గత మూడు రోజులుగా పలు ప్రాంతాల్లో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఇంధన ధరలు భారీగా పెరగబోతున్నాయంటూ వ్యాపించిన వదంతుల వల్లే ఈ కృత్రిమ కొరత ఏర్పడిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ప్రజలు ఆందోళనతో అవసరానికి మించి ఇంధనాన్ని కొనుగోలు చేస్తుండటంతో బంకుల వద్ద భారీ రద్దీ ఏర్పడి, డిమాండ్ అకస్మాత్తుగా పెరిగిందని వివరించారు. మిగతా.. 2లో



## ప్రభుత్వం చేతికి హైదరాబాద్ మెట్రో.. నేడో రేపో ఒప్పందం

- ప్రభుత్వపరం కానున్న హైదరాబాద్ మెట్రో ఫేజ్-1
- వాటా కొనుగోలు ఒప్పందంపై త్వరలో సంతకాలు
- సీఎం రేవంత్, ఎల్ అండ్ టీ ఛైర్మన్ సమక్షంలో ఒప్పందం
- రూ.13,615 కోట్ల అప్పును టేకోవర్ చేయనున్న ప్రభుత్వం
- మెట్రో ఫేజ్-1లో పీపీపీ విధానానికి ముగింపు

## లాభాల కోసమే ఓపెన్‌ఏఐ.. సంస్థను దోచుకుంటున్నారు: ఎలాన్ మస్క్



### సంచలన ఆరోపణలు

ఓపెన్‌ఏఐపై టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ కోర్టులో వాంగ్మూలం

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com
జనరల్ న్యూస్
గురువారం - 30 - ఏప్రిల్ - 2026

## యుద్ధంలో శత్రువులకు తలొంచవద్దని ఇరాన్ పోస్టు

ఢిల్లీ: యూకేలోని ఇరాన్ రాయబార కార్యాలయం, ఆ దేశంలో నివసిస్తున్న ఇరానీయులను ఉద్దేశించి చేసిన పోస్టు చర్చనీయాంశంగా మారింది. ఇరానీయులు దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేయడానికి సిద్ధంగా ఉండాలని 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. అమెరికా, ఇజ్రాయెల్‌తో జరుగుతున్న యుద్ధంలో శత్రువులకు తలొంచవద్దని, దేశాన్ని వారికి అప్పగించే బదులు మనమంతా ప్రాణాలను అర్పిద్దామని యూకేలో నివసిస్తున్న తమ పౌరులకు పిలుపునిచ్చింది. దేశంకోసం ఆత్మబలిదానానికి సిద్ధంగా ఉండాలని, అలాంటివారు తమను సంప్రదించాలని కోరింది. అయితే ఇరాన్ ఎంబసీ చేసిన పోస్టుపై విమర్శలు వస్తున్నాయి. ఇరాన్ ఎంబసీ చేసిన పోస్టు అనుచితమైనదని, ఆందోళనకరమైనదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇరాన్ దౌత్య కార్యాలయం చేసిన పోస్టు, ప్రజలను రెచ్చగొట్టేలా ఉందని యూకే అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పోస్టు చేసినందుకు ఆ దేశ రాయబారి సయ్యద్ అలీ మౌసావినికి సమన్లు జారీ చేశారు. అయితే ఇరాన్ రాయబార కార్యాలయం తమ పోస్టును సమర్థించుకోవడం గమనార్హం. ఇది దేశభక్తికి, దేశంపై విధేయతకు సంబంధించినదని పేర్కొన్నారు. హింసను ప్రోత్సహిస్తున్నట్లు కాదని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇరానీయులు ఎల్లప్పుడూ తమ మాతృభూమి పరిరక్షణకు ముందుంటారని తెలిపింది. యుద్ధంలో ప్రాణత్యాగానికి తనతో సహా ఇరాన్ పౌరులు సిద్ధంగా ఉండాలని ఆ దేశ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఇటీవల పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

## బీజేపీ రిగ్గింగ్‌కు పాల్పడుతోంది, ఈసీ అధికారులు ఉగ్రవాదుల్లా ప్రవర్తిస్తున్నారు: మమతా బెనర్జీ

ఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న రెండో దశ పోలింగ్‌లో రిగ్గింగ్ జరుగుతోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. తాను బరిలో నిలిచిన భవానీపూర్ నియోజకవర్గానికి మమతా బెనర్జీ వెళ్లారు. అదే సమయంలో ఆమెపై పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి కూడా అక్కడకు వచ్చారు. మమతా బెనర్జీని చూసిన సువేందు "ఆమెను చూడండి. ఈరోజు ఆమెకు ఎవరూ ఓటు వేయడం లేదు" అని వ్యాఖ్యానించారు. దీనితో బీజేపీ, ఎన్నికల సంఘంపై మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బలగాలకు చెందిన సభ్యులు తమ పార్టీ కార్యకర్తల ఇళ్లలోకి జొరబడి, ఓటర్లను భయపెడుతున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ రిగ్గింగ్‌కు పాల్పడుతోందని మండిపడ్డారు. ఎన్నికల సంఘం ప్రతినిధులు ఉగ్రవాదుల్లా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తను రాత్రి కొట్టారని, ఇదేం గూండాయిజమని ప్రశ్నించారు. ఓటింగ్ ఇలా జరగకూడదని మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. ఎన్నికలు అంటే ప్రజాస్వామ్య పండుగ అని, కానీ వారు పండుగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారని విమర్శించారు. మరోవైపు, సువేందు అధికారి కూడా మమతా బెనర్జీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆమె గూండాలను వెంటేసుకుని తిరుగుతూ ఓటర్లను భయపెడుతున్నారని ఆరోపించారు.

## లాభాల కోసమే ఓపెన్‌ఏఐ.. సంస్థను దోచుకుంటున్నారు: ఎలాన్ మస్క్ సంచలన ఆరోపణలు

ఢిల్లీ: ప్రముఖ కృత్రిమ మేధస్సు సంస్థ ఓపెన్‌ఏఐ, దాని సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌పై టెస్లా, ఎక్స్‌ఏఐ సీఈవో ఎలాన్ మస్క్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఓపెన్‌ఏఐ తన వ్యవస్థాపక లాభాపేక్ష రహిత లక్ష్యాన్ని విడిచిపెట్టి, పూర్తిగా వాణిజ్య ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తోందని ఆయన ఆరోపించారు. అమెరికాలోని ఓక్లాండ్ ఫెడరల్ కోర్టులో జరుగుతున్న ఈ కీలక విచారణలో మస్క్ తన వాంగ్మూలాన్ని వినిపించారు. మానవాళి ప్రయోజనాల కోసం సురక్షితమైన ఏఐని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఓపెన్‌ఏఐ ప్రారంభమైందని, కానీ ఇప్పుడు అది ఇతర టెక్ దిగ్గజాలతో పోటీ పడుతూ లాభార్జనే ధ్యేయంగా పనిచేస్తోందని మస్క్ తన వాదనలో పేర్కొన్నారు. సంస్థ ప్రారంభ దశలో తాను ఆర్థికంగా మద్దతు ఇచ్చింది, అది ఒక లాభాపేక్ష రహిత సంస్థగా, పారదర్శకంగా ఉంటుందనే నమ్మకంతోనే అని ఆయన స్పష్టం చేశారు. ఒక స్వచ్ఛంద సంస్థను 'దోచుకోవడం' సరైందేనని కోర్టు తీర్పు ఇస్తే, అది అమెరికాలోని దాతృత్వ స్ఫూర్తిని దెబ్బతీస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ భద్రతపై గూగుల్ పెద్దగా దృష్టి పెట్టడం లేదనే భావనతోనే తాను ఓపెన్‌ఏఐ ఏర్పాటులో పాలుపంచుకున్నట్లు వివరించారు. సంస్థ ప్రారంభంలో ప్రతిభావంతులను నియమించుకోవడంలో, ఇతర టెక్ భాగస్వాములతో సంబంధాలు నెలకొల్పడంలో తాను కీలక పాత్ర పోషించానని మస్క్ కోర్టుకు తెలిపారు.

మస్క్ ఆరోపణలను ఖండించిన ఓపెన్‌ఏఐ

మరోవైపు ఓపెన్‌ఏఐ ఈ ఆరోపణలను ఖండించింది. అధునాతన ఏఐ పరిశోధనలకు అయ్యే భారీ ఖర్చులను భరించడానికే పరిమిత-లాభాల నమూనాకు మారాల్సి వచ్చిందని వివరించింది. సంస్థపై తుది నియంత్రణ ఇప్పటికీ లాభాపేక్ష రహిత విభాగం చేతిలోనే ఉందని స్పష్టం చేసింది. 2015లో ఓపెన్‌ఏఐ సహ వ్యవస్థాపకుడిగా ఉన్న మస్క్, 2018లో సంస్థ నుంచి బయటకు వచ్చారు. ఆ తర్వాతే ఓపెన్‌ఏఐ వాణిజ్య విభాగాన్ని ఏర్పాటు చేసి మైక్రోసాఫ్ట్ వంటి సంస్థల నుంచి భారీగా పెట్టుబడులు ఆకర్షించింది. చాట్‌జీపీటీ విజయంతో ప్రపంచ ఏఐ రంగంలో అగ్రగామిగా నిలిచింది. ఓపెన్‌ఏఐతో విభేదించిన తర్వాత మస్క్ సొంతంగా 'ఎక్స్ఏఐ' పేరుతో మరో ఏఐ సంస్థను ప్రారంభించారు. ఈ కేసులో తనకు ఎలాంటి ఆర్థిక పరిహారం అవసరం లేదని, ఓపెన్‌ఏఐలో కేవలం వ్యవస్థాగత మార్పులనే కోరుతున్నట్లు ఆయన తెలిపారు. రాబోయే కొద్ది వారాల్లో కోర్టు వెలువరించబోయే తీర్పు, భవిష్యత్తులో ఏఐ సంస్థల పాలన, నిధుల సమీకరణ నమూనాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

## తెలంగాణలో టెన్త్ ఫలితాలు విడుదల... బాలికలదే పైచేయి

హైదరాబాద్: తెలంగాణలో పదో తరగతి పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 95.15 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు అధికారులు ప్రకటించారు. సీనియర్ నేత కే. కేశవరావు ఈ ఫలితాలను అధికారికంగా విడుదల చేశారు. ఎప్పటిలాగే ఈసారి కూడా ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. బాలికలు 96.26 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలురు 94.07 శాతంతో కాస్త వెనుకబడ్డారు. మార్చి 14 నుంచి ఏప్రిల్ 13 వరకు జరిగిన ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5,28,239 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాల్లో ములుగు జిల్లా 99.30 శాతంతో రాష్ట్రంలోనే అత్యధిక ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, 89.23 శాతంతో హైదరాబాద్ జిల్లా అత్యల్ప ఉత్తీర్ణతతో చివరి స్థానంలో నిలిచింది. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 99.10 శాతం ఉత్తీర్ణత నమోదవడం విశేషం. ఇక మీడియంల వారీగా చూస్తే.. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు 95.86 శాతంతో సత్తా చాటగా, తెలుగు మీడియంలో 89.14 శాతం, ఉర్దూ మీడియంలో 86.71 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది విద్యాశాఖ రెండు కీలక మార్పులు చేసింది. గతంలో మాదిరిగా గ్రేడ్లు కాకుండా, ఈసారి సబ్జెక్టుల వారీగా మార్కులను వెల్లడించారు. అంతేకాకుండా, విద్యార్థుల సౌలభ్యం కోసం తొలిసారిగా వాట్సాప్ ద్వారా ఫలితాలు తెలుసుకునే సదుపాయాన్ని కల్పించారు. తమ ఫలితాలను పొందాలనుకునే వారు 80969 58096 అనే వాట్సాప్ నెంబర్‌కు 'ఎఱ' అని మెసేజ్ పంపితే చాలు, వివరాలు వస్తాయి. వాట్సాప్‌తో పాటు అధికారిక వెబ్‌సైట్లలో కూడా విద్యార్థులు తమ మార్కుల మెమోలను చూసుకోవచ్చని అధికారులు తెలిపారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు సులభంగా ఫలితాలను తెలుసుకునే వీలు కలిగింది. మరోవైపు, ఫలితాలపై రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు రేపటి నుంచి మే 15 వరకు అవకాశం కల్పించారు. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను జూన్ 5 నుంచి 12 వరకు నిర్వహించనుండగా, ఈ పరీక్షల ఫీజు చెల్లింపునకు మే 14వ తేదీని ఆఖరి గడువుగా నిర్ణయించారు.

## తెలంగాణలో ఆస్తుల రిజిస్ట్రేషన్ భారం..

హైదరాబాద్: తెలంగాణలో ఇల్లు లేదా భూమి కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది ముఖ్యమైన వార్త. రాష్ట్రంలో వ్యవసాయ భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాల రిజిస్ట్రేషన్ల కోసం నిర్ధారించిన ప్రభుత్వ మార్కెట్ విలువలను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సవరించిన ఈ కొత్త విలువలు మే మొదటి వారం నుంచే అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఈ నిర్ణయంతో ఆస్తుల కొనుగోలుదారులపై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీల భారం గణనీయంగా పెరగనుంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని వనరుల సమీకరణపై ఏర్పాటైన కేబినెట్ ఉపసంఘం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. గత శుక్రవారం సచివాలయంలో జరిగిన సమావేశంలో ఈ కీలక నిర్ణయాన్ని ఆమోదించారు. మార్కెట్ విలువలను సవరించి, కొత్త రేట్లను అమలు చేయడానికి అవసరమైన మార్గదర్శకాలు, సాంకేతిక ఏర్పాట్లు చేయాలని రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖను కేబినెట్ ఉపసంఘం ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవడం, ప్రభుత్వ మార్కెట్ విలువలకు, బహిరంగ మార్కెట్‌లో ఉన్న వాస్తవ ధరలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడం ఈ పెంపు వెనుక ప్రధాన ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు. ఈ చర్య ద్వారా రియల్ ఎస్టేట్ రంగంలో నల్లధనం లావాదేవీలు తగ్గి, పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ సవరణ ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖకు అదనంగా సుమారు రూ.2,000 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా. డిసెంబర్ 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మార్కెట్ విలువల సవరణ చేపట్టడం ఇదే తొలిసారి. గతంలో 2021లో బీఆర్ఎస్ ప్రభుత్వం విలువలను సవరించింది. వాస్తవానికి, ఏడాది క్రితమే విలువలను పెంచాలని భావించినా, రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న మందగమనం కారణంగా ఆ ప్రతిపాదనను వాయిదా వేశారు.

## ప్రభుత్వం చేతికి హైదరాబాద్ మెట్రో.. నేడో రేపో ఒప్పందం

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశ ప్రాజెక్టు పూర్తిగా ప్రభుత్వపరం కానుంది. ప్రైవేటు భాగస్వామ్యంతో (పీపీపీ) నడుస్తున్న ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇందుకు సంబంధించి వాటా కొనుగోలు ఒప్పందం (ఎస్‌పీఏ)పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్.సుబ్రమణ్యం సమక్షంలో సంతకాలు జరగనున్నాయి. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధ్యక్షతన సమావేశమైన హెచ్‌ఎంఆర్ఎల్ బోర్డు.. ఈ స్వాధీన ప్రక్రియకు ఆమోదముద్ర వేసింది. ఒప్పందంపై సంతకాల కోసం ఎల్ అండ్ టీ ఛైర్మన్ హైదరాబాద్ పర్యటన కూడా ఖరారైంది. ఈ నెల 30వ తేదీ గడువు సమీపిస్తుండటంతో అధికారులు ఒప్పంద పత్రాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఒప్పందం ప్రకారం ఎల్ అండ్ టీ మెట్రోరైలు లిమిటెడ్‌కు ఉన్న రూ.13,615 కోట్ల అప్పును ప్రభుత్వం టేకోవర్ చేస్తుంది. ఈ మొత్తాన్ని ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) నుంచి తక్కువ వడ్డీకి రుణంగా తీసుకుని రీషెడ్యూల్ చేయనుంది. దీంతో పాటు హెచ్ఎండీఏ నుంచి రూ.1,385 కోట్లను ఈక్విటీగా ఎల్ అండ్ టీకి చెల్లించనుంది. వాస్తవానికి మార్చి 31 నాటికే ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉన్నా, ఐఆర్ఎఫ్‌సీ నుంచి రుణం మంజూరు ఆలస్యం కావడంతో గడువును ఏప్రిల్ 30కి పొడిగించారు. బుధ లేదా గురువారం ఈ ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ ఒప్పందంతో మెట్రో మొదటి దశలో పీపీపీ విధానం ముగిసి, అది ప్రభుత్వ ఆస్తిగా మారనుంది.

## యూపీ అభివృద్ధికి కొత్త జీవనాడి..

మొదటి పేజి తరువాయి

గంగా మాత పరిసర ప్రాంతాల గుండా వెళ్లే ఈ ప్రాజెక్టు ఉత్తరప్రదేశ్ అభివృద్ధికి కొత్త ఊతమిస్తుందని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ... "గంగామాత ఈ దేశానికి, యూపీకి ఎలా జీవనాడిగా ఉందో, అలాగే ఈ ఎక్స్‌ప్రెస్‌వే కూడా రాష్ట్ర అభివృద్ధికి కొత్త జీవనాడిగా మారుతుంది. ఈ రహదారికి గంగా మాత పేరు పెట్టడం సంతోషంగా ఉంది. ఇది మన అభివృద్ధి దార్శనికతతో పాటు మన గొప్ప వారసత్వాన్ని కూడా ప్రతిబింబిస్తుంది" అని అన్నారు. ఈ ఎక్స్‌ప్రెస్‌వేతో ప్రయాగ్‌రాజ్‌లోని సంగం, కాశీలోని బాబా విశ్వనాథుడి దర్శనం గంటల వ్యవధిలోనే సాధ్యమవుతుందని ఆయన వివరించారు.

ప్రాజెక్టు ముఖ్యాంశాలు

ఈ గంగా ఎక్స్‌ప్రెస్‌వే 594 కిలోమీటర్ల పొడవైన 6-లేన్ల యాక్సెస్-కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ హైవే. భవిష్యత్తులో దీనిని 8 లేన్లకు విస్తరించవచ్చు. ఇది ఉత్తరప్రదేశ్‌లోని పశ్చిమ, మధ్య, తూర్పు ప్రాంతాలను కలుపుతూ మీరట్ నుంచి ప్రయాగ్‌రాజ్ వరకు 12 జిల్లాల గుండా వెళుతుంది. దీనివల్ల మీరట్ నుంచి ప్రయాగ్‌రాజ్ మధ్య ప్రస్తుతం 10 నుంచి 12 గంటలుగా ఉన్న ప్రయాణ సమయం కేవలం 6 గంటలకు తగ్గుతుంది. ఈ ప్రాజెక్టులో మరో కీలకమైన అంశం షాజహాన్‌పూర్ జిల్లాలో ఏర్పాటు చేసిన 3.5 కిలోమీటర్ల ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ (ఎయిర్‌స్ట్రిప్). ఇది దేశ రక్షణ సన్నద్ధతకు, వ్యూహాత్మక అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ రహదారి వెంట పారిశ్రామిక, లాజిస్టిక్స్ కారిడార్లను అభివృద్ధి చేయనున్నారు. ఇది పరిశ్రమలను ఆకర్షించడం, రైతులకు మెరుగైన మార్కెట్ సౌకర్యం కల్పించడం, పర్యాటకాన్ని ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను పెంచడం వంటి బహుళ ప్రయోజనాలను అందిస్తుందని అధికారిక ప్రకటనలో తెలిపారు. ఆగ్రా-లక్నో వంటి ఇతర ఎక్స్‌ప్రెస్‌వేలతో ఈ రహదారి అనుసంధానమై, రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుంది.

## టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నారా లోకేశ్ ప్రమాణస్వీకారం

మొదటి పేజి తరువాయి

మంత్రి నారా లోకేశ్ ప్రమాణస్వీకారం చేశారు. పార్టీ అధినేత చంద్రబాబు లోకేశ్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. లోకేశ్ తో పాటు పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలతో కూడా చంద్రబాబు ప్రమాణం చేయించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమం జరిగింది. యువతకు, క్షేత్రస్థాయి కార్యకర్తలకు ప్రాధాన్యతనిస్తూనే, అనుభవజ్ఞులైన నేతలను పొలిట్ బ్యూరోలో కొనసాగించడం ద్వారా 'పాత-కొత్త' కలయికను సమర్థవంతంగా అమలు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మండల, క్లస్టర్ స్థాయి నేతలకు కూడా పొలిట్ బ్యూరోలో చోటు కల్పించడం ద్వారా, సాధారణ కార్యకర్త కూడా ఉన్నత స్థాయికి ఎదగగలడనే బలమైన సంకేతాన్ని పార్టీ పంపింది.

ఇకపై ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ లోకేశ్ పాత్ర ఇప్పుడు మరింత కీలకం కాబోతోంది. పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే బాధ్యతను ఆయనకు అప్పగించినట్లు కనిపిస్తోంది. పదవుల కేటాయింపులో సామాజిక సమీకరణాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఈ భారీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.

## ఆందోళన వద్దు, నిల్వలు సరిపడా ఉన్నాయి ప్రజలకు ప్రభుత్వం భరోసా

మొదటి పేజి తరువాయి

ఈ పరిస్థితికి పలు కారణాలు దోహదం చేశాయని ప్రభుత్వం పేర్కొంది. పశ్చిమ బెంగాల్ ఎన్నికల తర్వాత ఇంధన ధరలు పెరుగుతాయనే ప్రచారం ప్రజల్లో ఆందోళన రేకెత్తించింది. దీనికి తోడు పారిశ్రామిక అవసరాలకు వాడే డీజిల్ ధర లీటరుకు రూ.150కి చేరడంతో ఆ వినియోగదారులు కూడా తక్కువ ధరకే లభించే సాధారణ బంకులపై ఆధారపడుతున్నారు. ఇదే సమయంలో ఏపీ, మహారాష్ట్ర వంటి సరిహద్దు రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలు కూడా తెలంగాణలోని బంకుల్లోనే ఇంధనం నింపుతుండటంతో డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. దీంతో వచ్చిన సరుకు వచ్చినట్లే అమ్ముడైపోయి, బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు దర్శనమిచ్చాయి. ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఇంధన సరఫరాను సాధారణం కంటే 126 శాతం పెంచినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను వేగవంతం చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర చమురు కంపెనీలకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 3,100 ట్యాంకర్లను నిరంతర సరఫరా కోసం రంగంలోకి దించారు. ఈ నెల 27వ తేదీ నాటికి రోజువారీ డీజిల్ పంపిణీ 151 శాతం, పెట్రోల్ పంపిణీ 95 శాతానికి పెరిగింది. ప్రస్తుతం పంట కోతలు, ధాన్యం కొనుగోళ్ల సమయం కావడంతో రైతులకు, రవాణా రంగానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రతి మూడు గంటలకోసారి బంకుల్లోని నిల్వలను సమీక్షిస్తూ, కొరత ఉన్న ప్రాంతాలకు తక్షణమే ట్యాంకర్లను పంపిస్తున్నారు. ప్రజలు వదంతులను నమ్మి ఆందోళన చెందవద్దని, రాష్ట్రంలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

## రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ చెప్పిందొకటి, అధికారంలోకి వచ్చాక చేస్తోంది మరొకటని విమర్శించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ చెప్పిన రైతు డిక్లరేషన్ పెద్ద బోగస్ అని ఆరోపించారు. పంటల కొనుగోళ్లకు సంబంధించి ఆయన ఈ లేఖను రాశారు. గతంలో తాలు పేరిట తరుగు తీస్తే తోలుతీస్తానన్న సీఎం రేవంత్ రెడ్డి, ఇప్పుడు కేంద్రాల్లోకి వెళ్లి చూడాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం కుప్పలు తెప్పలుగా వస్తున్నా, ఇంకా కొనుగోళ్లు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. మిల్లుల దగ్గర కూడా బస్తాకు కిలో, రెండు కిలోల తరుగు తీస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఎండల్లో రైతులు మాడిపోతున్నా ప్రభుత్వానికి సోయిలేదని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం, సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పొద్దుతిరుగుడు రైతుల కష్టాలు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి పట్టదా? అని నిలదీశారు. 20 రోజులుగా కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారని అన్నారు. కేంద్రం కొనుగోలు చేసిన పొద్దుతిరుగుడు పంట పావు వంతు మాత్రమేనని అన్నారు. మిగిలిన 1.20 లక్షల క్వింటాళ్లను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. శనగ రైతుల పాలిట కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు శనిలా మారాయని అన్నారు. అనవసర కారణాలతో కేంద్రాల్లో కొనుగోళ్లు నిలిపివేశారని అన్నారు. శనగలకు మద్దతు ధర రూ.5,875 ఉంటే, ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు మూడు నాలుగు వేల రూపాయలకే రైతులు అమ్ముకునే దుస్థితి వచ్చిందని అన్నారు. జొన్నల కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. కనీస మద్దతు ధర రూ.3,370 ఉంటే ప్రైవేటు వ్యక్తులకు రూ.2,500కు రైతులు అమ్మవలసిన పరిస్థితి వస్తోందని అన్నారు. మొక్కజొన్న కొనుగోలు నిబంధనను సడలించాలని కోరారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హరీశ్ రావు పేర్కొన్నారు.

## రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు దానవీరశూరకర్ణ, ఎన్నికల తర్వాత కుంభకర్ణ

కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీలకు నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు ఆయన పాలమూరు బిడ్డ, ఇప్పుడు కనీసం పాలమూరు ప్రాజెక్టును పట్టించుకోని బిడ్డ అని ఎద్దేవా చేశారు. నాగర్ కర్నూలు, పాలమూరులలోనే రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తుంటే సిగ్గనిపించడం లేదా అని మండిపడ్డారు. విద్యుత్ ఇవ్వడం లేదని, గురుకులాల్లో విద్యార్థులు చనిపోతున్నారని, రైతు బంధు ఖాతాల్లో పడటం లేదని, వీటికి ఆయనకు సిగ్గనిపించడం లేదా అని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నాయకులు తిడుతుంటే తనకు పైశాచిక ఆనందం వస్తుందని రేవంత్ రెడ్డి చెబుతుంటే విడ్డూరంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తమ గ్రామాలు, మండలాల్లో ఉండే సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. మరో సంవత్సరం తర్వాత రేవంత్ రెడ్డి చెబితే, కూర్చున్న కుక్క కూడా లేవదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ దుర్మార్గపు, అరాచకపు పాలనను మరొక్క సంవత్సరం తట్టుకుంటే, చివరి ఏడాది అంతా ఎన్నికల హడావుడి ఉంటుందని అన్నారు.

## మోదీ హైదరాబాద్ సభకు 'జనాగ్రహ సభ'గా నామకరణం

కేంద్రంలో మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని తొలిసారిగా తెలంగాణకు వస్తుండటంతో, దీనిని ఒక చారిత్రాత్మక విజయ సంకేతంగా మలిచేందుకు రాష్ట్ర బీజేపీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు 'జనాగ్రహ సభ'గా రాష్ట్ర బీజేపీ నేతలు నామకరణం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, విపక్ష బీఆర్ఎస్ వైఫల్యాలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను (ఆగ్రహాన్ని) ఓట్లుగా మలుచుకోవాలన్నది బీజేపీ ఉద్దేశ్యం. ఈ సభను రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా నిర్వహించేందుకు బీజేపీ నేతలు సన్నద్ధమవుతున్నారు. సుమారు 3 లక్షల మందిని సభకు తరలించడం ద్వారా అటు కాంగ్రెస్‌కు, ఇటు బీఆర్ఎస్‌కు తమ బలాన్ని చాటాలని భావిస్తున్నారు. మరోవైపు, కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, జహీరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్, రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ, నేషనల్ హైవేల విస్తరణ వంటి భారీ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయడం ద్వారా 'డబుల్ ఇంజిన్ సర్కార్' ఆవశ్యకతను ప్రధాని నొక్కి చెప్పనున్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, హైదరాబాద్, సైబరాబాద్ పరిధిలో పట్టు సాధించేందుకు మోదీ పర్యటనను ఒక గొప్ప అవకాశంగా వాడుకోవాలని కమలనాథులు భావిస్తున్నారు. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ బిల్లు అంశాన్ని ప్రస్తావించడం ద్వారా మహిళా ఓటర్లను ఆకర్షించే అవకాశం ఉంది.

## పవన్ కల్యాణ్‌తో నేను బాగానే ఉన్నా.. అతిగా ప్రవర్తిస్తే సహించేదిలేదు: టీడీపీ నేతలకు చంద్రబాబు వార్నింగ్

అమరావతి: టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు సొంత పార్టీ నేతలకు, కార్యకర్తలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అధికారం వచ్చిందన్న అహంతో ఎవరూ ఇగోలకు పోవద్దని, క్రమశిక్షణ తప్పితే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. టీడీపీ కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు.. పార్టీ నేతలు, కార్యకర్తల ప్రవర్తనపై కీలక సూచనలు చేస్తూనే, మరోవైపు వైసీపీపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు.

అతిగా ప్రవర్తిస్తే ప్రజలు హర్షించరు

"ఈ మధ్య జరిగిన కొన్ని సంఘటనలు నన్ను తీవ్ర మనస్తాపానికి గురి చేశాయి. మనం సుపరిపాలన అనే యజ్ఞం చేస్తుంటే, మన నేతలే సరిగా వ్యవహరించకుంటే బాధ కలుగుతుంది. ప్రజలతో సౌమ్యంగా ఉండాలి, వారికి అందుబాటులో ఉండాలి. నేతలు, కార్యకర్తలు చేసే తప్పులు పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తాయి" అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లెక్సీలు, ఫొటోలు, కుర్చీల దగ్గర చిన్నపాటి గొడవలు కూడా రాకూడదని, అతిగా ప్రవర్తిస్తే ప్రజలు హర్షించరని హితవు పలికారు. గత పాలకుల గర్వాన్ని, అహంకారాన్ని చూసే ప్రజలు వారికి బుద్ధి చెప్పారని గుర్తుచేశారు. బూతులు, దాడులు, సెటిల్మెంట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

మిత్రపక్షాలతో సమన్వయం అత్యవసరం

కూటమి ధర్మాన్ని పాటిస్తూ జనసేన, బీజేపీ నేతలతో సమన్వయంతో ముందుకు సాగాలని చంద్రబాబు స్పష్టం చేశారు. "నేను, పవన్ కల్యాణ్ ఎంతో చక్కగా ఉంటున్నాం. మంచి సంబంధాలు కొనసాగిస్తున్నాం. ఇదే స్ఫూర్తి క్షేత్రస్థాయిలోనూ కనిపించాలి. బీజేపీని కూడా సమన్వయం చేసుకుని వెళ్లాలి. రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య గ్యాప్ లేదు, రాకూడదు" అని ఆయన పేర్కొన్నారు. తాను లేకుండా ఎంపీ రాకూడదని ఎమ్మెల్యేలు అనడం సరైన పద్ధతి కాదని, అందరూ మనస్పర్థలు లేకుండా పనిచేయాలని సూచించారు.

నేరస్థులతో పోరాడుతున్నాం

ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "నా రాజకీయ జీవితంలో ఎంతోమంది నేతలతో పోరాడాను. కానీ తొలిసారిగా నేరస్థులతో పోరాడుతున్నాం. సొంత బాబాయి వివేకాను హత్య చేసి ఆ నెపాన్ని మనపై నెట్టారు. తమ కార్యకర్తను కారుతో తొక్కించి ఆ పాపాన్ని కూడా మనకే అంటించారు. కబ్జా చేసిన ఆస్తుల కోసం కడపలో అనుచరుడినే చంపేశారు" అని తీవ్ర ఆరోపణలు చేశారు. వాస్తవాలు బయటపడితే ఎదురుదాడి చేయడం వారికి అలవాటని విమర్శించారు. మనది అభివృద్ధి అయితే వాళ్లది అవినీతి అని, మనది వికాసం అయితే వాళ్లది విధ్వంసమని అన్నారు.

భవిష్యత్ ఎన్నికలే లక్ష్యం

రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రజలు కూటమికి ఓటేశారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని చంద్రబాబు అన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్షంగా విజయం సాధించాలని పిలుపునిచ్చారు. "మరో మూడేళ్లలో మళ్లీ ఎన్నికలు వస్తాయి. 2024లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు సాధించాలి. అప్పుడే మనం బాగా పనిచేసినట్టు. వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా ఉండొద్దు, మళ్లీ మళ్లీ గెలవాలి. పనిచేసిన వారికే పదవులు వస్తాయి" అని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేసి పార్టీ ప్రతిష్టను పెంచాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

## రాజకీయ ప్రసంగాల కన్నా ఉపాధి హామీపై మాట్లాడితే బాగుండేది

అమరావతి: ఏపీ ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు చేస్తున్న ప్రయత్నాలపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తనదైన శైలిలో స్పందించారు. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటును స్వాగతిస్తూనే, ఉద్యోగాల కల్పన విషయంలో ప్రభుత్వానికి కీలక సూచనలు చేశారు. ప్రోత్సాహకాలు, భూముల కేటాయింపులకు బదులుగా రాష్ట్ర యువతకు శాశ్వత ఉపాధి లభించేలా స్పష్టమైన హామీ ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన సందర్భంగా మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రసంగంపై విజయసాయిరెడ్డి స్పందించారు. ఇలాంటి వేదికలపై రాజకీయ ప్రసంగాలు చేయడం కన్నా, గూగుల్ ద్వారా రాష్ట్ర యువతకు ఎంతకాలంలో, ఏయే విభాగాల్లో, ఎన్ని ఉద్యోగాలు వస్తాయో స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ప్రకటించి ఉంటే బాగుండేదని ఆయన ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఐటీ రంగంలో భారీ స్థాయిలో ఉద్యోగాల కోతలు (లే ఆఫ్స్) ఉన్నాయని గుర్తుచేస్తూ, ఇలాంటి తరుణంలో ఉపాధిపై ప్రభుత్వ భరోసా ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఐటీ కంపెనీలకు ప్రభుత్వం ఎకరా 99 పైసలకే భూములు కేటాయించడంపై తనకు ఎలాంటి అభ్యంతరం లేదని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. అయితే, ప్రభుత్వం కల్పించే రాయితీలు, ప్రోత్సాహకాలు రాష్ట్ర ప్రజలకు నిరంతరం, భారీ స్థాయిలో ఉపాధిని కల్పించేలా ఉండాలని షరతు పెట్టారు. అప్పుడే అది ప్రజా ప్రయోజనాల కోసం జరిగిన ఒప్పందంగా పరిగణించవచ్చని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షించేందుకు పలు కంపెనీలకు భారీ ప్రోత్సాహకాలు ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. అనకాపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్, విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌కు ఇప్పటికే శంకుస్థాపనలు జరిగాయి. ఈ క్రమంలోనే పలు ఐటీ కంపెనీలకు విశాఖలో ఎకరా భూమిని కేవలం 99 పైసలకే కేటాయించారు. ఇటీవల వైసీపీకి, తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన విజయసాయిరెడ్డి రాజకీయాలకు విరామం ప్రకటించారు. అయితే, త్వరలోనే మళ్లీ రాజకీయాల్లోకి రీ-ఎంట్రీ ఇస్తానని ప్రకటించిన ఆయన, ప్రస్తుతం ఎక్స్ వేదికగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలపై తన అభిప్రాయాలను వెల్లడిస్తూ చురుగ్గా ఉంటున్నారు.

## నేడు ఏపీ టెన్త్ ఫలితాలు.. మంత్రి నారా లోకేశ్ ప్రకటన

అమరావతి: ఏపీలో పదో తరగతి పరీక్ష ఫలితాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు ముఖ్యమైన అప్‌డేట్. పదో తరగతి పరీక్ష ఫలితాలు నేడు (ఏప్రిల్ 30) ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. ఈ విషయాన్ని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తన ఎక్స్ ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. ఫలితాలను సులువుగా తెలుసుకునేందుకు ప్రభుత్వం పలు మార్గాలను అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థులు తమ ఫలితాలను results.bse.ap.gov.in అనే అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. వీటితో పాటు మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009కు 'హాయ్' అని సందేశం పంపడం ద్వారా కూడా ఫలితాలను పొందవచ్చని మంత్రి లోకేశ్ తెలిపారు. అలాగే, లీప్ యాప్ ద్వారా కూడా రిజల్ట్స్ తెలుసుకోవచ్చని ఆయన సూచించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ స్కూల్ లాగిన్ ద్వారా నేరుగా మార్కుల మెమోలను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించారు. ఈ ఏడాది మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగిన పదో తరగతి పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6.30 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాల విడుదల నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఉత్కంఠ నెలకొంది.

## ఇంధనాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్

అమరావతి: ఇంధనాన్ని పక్కదారి పట్టిస్తూ, కృత్రిమ కొరత సృష్టించే వారిపై ఉక్కుపాదం మోపాలని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత, అక్రమాలపై మంత్రి నాదెండ్ల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అక్రమాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఇంధన బంకుల నిర్వహణపై పలు కీలక సూచనలు చేశారు. కొన్ని బంకుల్లో స్టాక్ ఉన్నప్పటికీ 'నో స్టాక్' బోర్డులు పెట్టి వినియోగదారులను ఇబ్బంది పెడుతున్నారని, అలాంటి యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంధన లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం అమలు చేస్తున్న 'రేషన్ పద్ధతి'ని కొనసాగించాలని సూచించారు. ముఖ్యంగా ఆక్వా, వరి రైతులకు వ్యవసాయ పనులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంధన సరఫరాలో ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా ఇంధన కొరతపై తప్పుడు వార్తలు వ్యాప్తి చేస్తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించే వారిని గుర్తించి, వెంటనే కేసులు నమోదు చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. ఇంధనం పోయడానికి నిరాకరిస్తున్న బంకులపై 1967 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై జిల్లా అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. గతంతో పోలిస్తే రాష్ట్రంలో బంకుల మూసివేత గణనీయంగా తగ్గిందని, చమురు కంపెనీల నుంచి ఇంధన సరఫరా కూడా మెరుగుపడిందని నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు.

## చంద్రబాబు ఫోన్‌కు కేంద్రమంత్రి ఫిదా.. ఫోన్ ఫీచర్లు అడిగి తెలుసుకున్న అశ్వినీ వైష్ణవ్.. విశాఖ సభలో ఆసక్తికర ఘటన!

అమరావతి: విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గంలోని తర్లువాడలో జరిగిన గూగుల్ క్లౌడ్ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమం ఓ ఆసక్తికర సన్నివేశానికి వేదికైంది. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, కేంద్ర రైల్వే, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పాల్గొన్నారు. అయితే, సభా వేదికపై చంద్రబాబు చేతిలో ఉన్న మొబైల్ ఫోన్‌పై కేంద్రమంత్రి దృష్టి పడింది. వెంటనే ఆయన ఆ ఫోన్‌ను తీసుకుని ఆసక్తిగా పరిశీలించడం అందరినీ ఆకర్షించింది. చంద్రబాబు వాడుతున్న కొత్త ఫోల్డబుల్ ఆండ్రాయిడ్ ఫోన్‌ను చేతిలోకి తీసుకున్న అశ్వినీ వైష్ణవ్, దాని పనితీరు, ప్రత్యేకతల గురించి అడిగి తెలుసుకున్నారు. అది ఏ మోడల్, అందులో ఉన్న ఫీచర్లు ఏమిటని క్షుణ్ణంగా ఆరా తీశారు. చంద్రబాబు కూడా ఓపిగ్గా తన ఫోన్ గురించి కేంద్రమంత్రికి వివరించారు. ఉన్నతస్థాయి నేతల మధ్య జరిగిన ఈ సరదా సంభాషణకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇంతకీ ముఖ్యమంత్రి వాడుతున్న ఆ ఫోన్ ఏ కంపెనీకి చెందింది, దాని ధర ఎంత అనేదానిపై నెటిజన్లు చర్చించుకుంటున్నారు.

చంద్రబాబుపై అశ్వినీ వైష్ణవ్ ప్రశంసలు

ఈ ఘటనతో పాటు ఇదే సభలో సీఎం చంద్రబాబుపై అశ్వినీ వైష్ణవ్ ప్రశంసల వర్షం కురిపించారు. చంద్రబాబును దేశం గర్వించదగ్గ విజనరీ లీడర్ అని అభివర్ణించారు. గతంలో ఆయన హైదరాబాద్‌లో సైబరాబాద్ నిర్మించి ఐటీ అభివృద్ధికి ఎలా బాటలు వేశారో గుర్తు చేశారు. ఇప్పుడు ఆయన నాయకత్వంలో విశాఖపట్నం కూడా ఓ 'ఐటీపట్నం'గా అభివృద్ధి చెందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుల దార్శనికతకు సెల్యూట్ చేస్తున్నానన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, ముఖ్యంగా రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, ఇప్పటికే భారీగా నిధులు కేటాయించామని తెలిపారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 29 : రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 30వ తేదీన సి.ఆర్.డి.ఏలో జరగనున్న కార్యక్రమానికి హాజరుకానున్న దృష్ట్యా బుధవారం జిల్లా కలెక్టర్ సి.ఎం సాయికాంత్ వర్మ ఏర్పాట్లను పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ తో కలిసి పరిశీలించారు. ఈ నెల 25వ తేదీన ముంబాయి వేదికగా "బిజినెస్ రిఫార్మర్" అవార్డును ముఖ్యమంత్రి అందుకున్న సంగతి తెలిసిందే. ఈ అవార్డును వ్యక్తిగత అవార్డుగా కాకుండా టీం అవార్డుగా భావిస్తూ తన ఔన్నత్యాన్ని తెలియజేయడమే కాకుండా క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డుల సిబ్బందితో సహా అందరి భాగస్వామ్యం ఉందని, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డుల సిబ్బంది నుండి రాష్ట్ర సచివాలయం ఉన్నత అధికారులైన ప్రధాన కార్యదర్శి, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు., రాష్ట్ర మంత్రులతో అవార్డు విశేషాలను పంచుకోనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఏర్పాట్లు తనిఖీ చేసి ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.డి.ఏ అదనపు కమిషనర్ లు భార్గవ తేజ, కొల్లాబత్తుల కార్తీక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, గుంటూరు రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, ఎం.టి.ఎం.సి కమిషనర్ అలీం భాషా, రవాణా శాఖ ఉప కమిషనర్ సీతారామిరెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఎం శ్రీనివాసరెడ్డి, తుళ్ళూరు తహసీల్దార్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మహిళా కళాశాలలో 6వ సెమిస్టర్ లో 100 శాతం ఉత్తీర్ణత



శ్రీకాకుళం, మహి న్యూస్, ఏప్రిల్ 29: నగరంలోని ప్రభుత్వ మహిళా (స్వయం ప్రతిపత్తి) కళాశాలలో 2023-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. సూర్యచంద్ర రావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ టి. ఆదిలక్ష్మి కలిసి ఈ ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. ఈ ఫలితాల్లో కళాశాల విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచారు. బి.ఏ, బి.కాం, బి.ఎస్సీ విభాగాల్లో నూరు శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఓవరాల్‌గా కళాశాల మొత్తం ఫలితాల్లోనూ 100 శాతం సాధించడం విశేషం. 2023-25 అడ్మిటెడ్ బ్యాచ్‌లో మొత్తం 417 మంది విద్యార్థినులకు గాను, ఇప్పటివరకు 330 మంది (79.23%) విజయవంతంగా డిగ్రీ పట్టభద్రులయ్యారు. కేవలం అకడమిక్ పరీక్షల్లోనే కాకుండా, ఇంటర్న్‌షిప్‌లో కూడా విద్యార్థినులు 100 శాతం ఫలితాలు సాధించడం పట్ల ప్రిన్సిపాల్ సూర్యచంద్ర రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించడానికి కృషి చేసిన అధ్యాపక బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. చిన్నారావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. పద్మావతి, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పి.ఎస్. కనకదుర్గ, వై. ప్రశాంతి పాల్గొన్నారు. అలాగే డేటా ఎంట్రీ ఆపరేటర్లు పి. సంతోష్, జి. శశికాంత్, బి. శ్రావణి ఇతర బోధన, బోధనేతర సిబ్బంది ఈ ఫలితాల విడుదల కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

## ఇంటి పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోండి

శ్రీకాకుళం, మహి న్యూస్, ఏప్రిల్ 29: నగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్ను దారులు ప్రభుత్వం కల్పించిన వడ్డీ మాఫీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ హనుమంతు కూర్మారావు ఒక ప్రకటనలో కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పాత బకాయిలపై ఉన్న వడ్డీలో 50 శాతం రాయితీని కల్పిస్తూ మున్సిపల్ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని, పన్ను దారులు అసలు మొత్తంతో పాటు రాయితీ పోను మిగిలిన సగం వడ్డీని ఏకకాలంలో చెల్లించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అలాగే 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించే వారికి 5 శాతం మినహాయింపు లభిస్తుందని, ఈ సదవకాశాన్ని పొందేందుకు ఏప్రిల్ 30 ఆఖరి గడువు అని తెలిపారు. నగర ప్రజలందరూ గడువులోగా పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా నందీశ్వర స్వామి అభిషేకం





తాళ్ళరేవు, మహి న్యూస్, ఏప్రిల్ 29.: కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం సుంకరపాలెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి వారి ఆలయంలో త్రయోదశి సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీకంఠం భీమేశ్వర శర్మ బ్రహ్మత్వంలో కోప్పిశెట్టి బుజ్జి శ్రీమతి భారతి,, మరియు తిరగళ్ల వెంకన్నబాబు కుటుంబ సభ్యులచే నందీశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఈ అభిషేకం చేయించుకోవడం వల్ల ప్రతి మనిషిలో తెలియని దోషాలు తలుగుతాయని ప్రగాఢ నమ్మకం అని అర్చకులు తెలిపారు. దాతల సహకారంతో ప్రతి నెల త్రయోదశినాడు నందీశ్వర స్వామి వారికి పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మరియు పరిసర ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు.

## పెట్రోల్ ధర రూ.10, డీజిల్ ధర రూ.12.50 పెరిగిందా?




న్యూఢిల్లీ: దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిందనే కథనాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే, ఆ కథనాల్ని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఖండించింది. దేశంలో ఇంధన ధరలు పెరగలేదని, స్థిరంగా ఉన్నట్లు పేర్కొంది. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ పెట్రోల్ ధరలను రూ.10, డీజిల్ ధరలను రూ.12.50 పెంచినట్లు సోషల్ మీడియా పోస్టులు వైరల్‌గా మారాయి. ఇంధన ధరల పెంపుపై వస్తున్న వదంతులను భారత ప్రభుత్వం బుధవారం ఖండించింది. పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ నుండి వచ్చిన అధికారిక ఉత్తర్వు అంటూ ప్రచారంలో ఉన్న ఓ పత్రాన్ని ట్వీట్‌లో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో షేర్ చేసింది. ఆ పత్రం 'నకిలీ'దని ప్రకటించింది. వదంతులను నమ్మొద్దని కోరింది. ఇంధన ధరలు పెరిగాయంటూ సర్క్యులేట్ అవుతున్న పత్రాన్ని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ చెక్ చేసింది. అది ఫేక్ న్యూస్ అని తేల్చింది. భారత ప్రభుత్వం అటువంటి ఉత్తర్వులేవీ జారీ చేయలేదు'అని పేర్కొంది.

# తెలంగాణా ప్రభుత్వం అకాడమీ నిధులు వెంటనే విడుదల చేయాలి



గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 29 : ఉమ్మడి రాష్ట్రము నుండి విడిపోయాక తెలుగు అకాడమీ ఆంధ్రప్రదేశ్ కి రావాల్సిన నిధులు కోర్టు ఆదేశాలు వున్నా ఇవ్వలేదని తెలుగు మరియు సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్. డి. విల్సన్ ఏశరత్ చంద్ర అన్నారు. తెలంగాణా అకాడమీ నుండి ఉమ్మడి ఎఫ్. డి ల తాలూకు వడ్డీ, స్థిర.. చర ఆస్తుల పంపిణీ జరగలేదని.. వాహనాల పంపిణీ కూడా జరగలేదు.. ఉమ్మడి గా వేసుకున్న పుస్తకాలు, పర్నీ చర్ పంపిణీ కూడా జరగలేదు అని విల్సన్ అన్నారు. ఈ విషయం లో పలుసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోతుంది అని తద్వారా ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ తీవ్రమైన ఆర్థిక సంక్షోభం కు లోను అవుతుంది అన్నారు. అదే సమయంలో అకాడమీ నుండి వేసే ఇంటర్ ఫ్రీ బుక్ బకాయి లు ప్రస్తుత సంవత్సరం కు కలుపు కొని 50 కోట్ల పై చిలుకు రావాలి అన్నారు. ఈ విషయమై సమగ్ర ఎస్. పి డి ని కలిసి కూడా మాట్లాడమని.. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ లకు కూడా లేఖ రాసాము అన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి వెంటనే స్పందించి నిధులు విడుదల కు ఆదేశాలు ఇవ్వాలని విల్సన్ విజ్ఞప్తి చేశారు. బకాయిలు పేరుకు పోతే అకాడమీ అస్థిత్వమే దెబ్బతింటుంది అన్నారు.

### వర్చువల్ అకాడమీ

తమిళనాడు తరహాలో ఆంధ్రప్రదేశ్ కు వర్చువల్ అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తున్నాం అని ఈ మేరకు విద్యా శాఖ మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ తయారు చేస్తున్నాం అన్నారు. తమిళనాడు ప్రభుత్వం వర్చువల్ అకాడమీ ద్వారా 45 దేశాల్లోని తమిళులకు భాష నేర్పిస్తున్నారు అన్నారు. తెలుగు భాష పరిరక్షణ కు కట్టుబడి ప్రపంచంలోని తెలుగు వారికి ఆంధ్రప్రదేశ్ లో స్థిర పడ్డ తెలుగు భాషే తరులు కూడా మాతృ భాష పై మరింత పునాది వేస్తాం అన్నారు. మైగ్రేటడ్ లేబర్స్ కి.. ఇతర రాష్ట్రాల్లో విద్య అభ్యసించిన వారికి కూడా భాష నేర్పిస్తాం అన్నారు.

### కేబినెట్ క్యాడర్ అనివార్యం

తెలుగు భాషను ధ్వంసం చేసిన గత ప్రభుత్వం లో కూడా తెలుగు మరియు సంస్కృత అకాడమీ చైర్మన్ కి కేబినెట్ క్యాడర్ ఇచ్చినప్పుడు ప్రస్తుత ప్రభుత్వం కూడా కేబినెట్ క్యాడర్ ఇస్తే తెలుగు మరియు సంస్కృత భాష కు సముచిత ప్రాధాన్యత ఇచ్చినట్టు అవుతుంది అన్నారు. క్యాబినెట్ హోదా ఇవ్వమని ఇప్పటికే సీయం గారికి లేఖ రాశాను అన్నారు. లోకేష్ గారికి ద్రుష్టి కి కూడా తీసుకొని వెళ్ళాను అన్నారు. ఉర్దూ అకాడమీ కి ఏ గ్రేడ్ ఇచ్చిన ప్రభుత్వం.. రెండు భాషల గౌరవం పెరిగేలా నిర్ణయం తీసుకోవాలి అని విజ్ఞప్తి చేశారు.

### ప్రయివేటు సంస్థ లకు విన్నపం

నారాయణ, చైతన్య.. బాష్యం వంటి ప్రయివేటు విద్యా సంస్థలు అకాడమీ పుస్తకాలు తమ విద్యార్థులకు పంపిణీ చెయ్యడం లేదన్న విమర్శలు తమ ద్రుష్టి కి వచ్చాయని ఈ ఏడాదైనా అకాడమీ పుస్తకాలు కొనుగోలు చేసేలా తమ విద్యార్థులకు ఆదేశాలు ఇవ్వాలని విల్సన్ కోరారు.తెలంగాణా ప్రభుత్వం గతం లో తెలుగు అకాడమీ పుస్తకాలే కొనుగోలు చేసేలా ఇచ్చిన ఆదేశాలు ఆంధ్రప్రదేశ్ లో కూడా అమలు చేయమని మంత్రి కి విజ్ఞాపన పత్రం ఇచ్చాం అని విల్సన్ తెలియ చేశారు.

### అకాడమీ భవన నిర్మాణం

తెలుగు అకాడమి భవన నిర్మాణం కు రెండు ఎకరాల భూమి కోరుకొని వున్నాం అని భూమి స్వాధీనం చేస్తే భవన నిర్మాణం కి అకాడమీ నిధులతో చేపడతాము అన్నారు.ఈ మేరకు 15 కోట్లు భవన నిర్మాణం కు నిధులు కేటాయించి వున్నాం అన్నారు.

### పోస్టుల భర్తీ సత్వరం

అకాడమీ లో 13 పోస్టులు సత్వరం భర్తీ చెయ్యాలని ప్రభుత్వం ని కోరి వున్నాం అన్నారు. ఆంధ్రప్రదేశ్ సర్వీస్ కమీషన్ ద్వారా భర్తీ చెయ్యడం ఆలస్యం అయ్యే పక్షం లో యూనివర్సిటీ ద్వారా భర్తీ చేసుకోడానికి అనుమతి కోరుతున్నట్టు విల్సన్ తెలియ చేశారు.

## ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కళాశాలల వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహణ




గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 29 : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గోల్డెన్ జూబిలీ (50 సంవత్సరాల) వేడుకల సందర్భంగా కళాశాలల వార్షికోత్సవాలు--2026ను బుధవారం డా. హెచ్.హెచ్. డీచ్‌మన్ ఢ డా. ఎస్. జాన్ డేవిడ్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం గణపతి పూజ, విశ్వవిద్యాలయ గీతంతో ప్రారంభమై, అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కొనసాగింది. ప్రారంభంలో గాన ప్రదర్శనలు, విద్యార్థిని ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె. గంగాధర్ రావు హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా డా. ఘజల్ శ్రీనివాస్, అర్జున అవార్డు గ్రహీత ఒలింపియన్ మంగళ్ సింగ్ చాంపియా, కళారత్న శ్రీ దామోదర గణపతి రావు పాల్గొన్నారు. గౌరవ అతిథులుగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. సింహాచలం, రెక్టర్ ప్రొఫెసర్ ఆర్. శివరాం ప్రసాద్, ఓఎస్డీ ప్రొఫెసర్ ఆర్.వి.ఎస్.ఎస్.ఎన్. రవికుమార్ హాజరయ్యారు. కళారత్న దామోదర గణపతి రావు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సాంప్రదాయ కళల ప్రాముఖ్యతను వివరించి, యువత కళల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. ఆర్చరీ కోచ్ చెరుకూరి సత్యనారాయణ మాట్లాడుతూ తన జీవితంలో ఎదురైన కష్టాలు, ఆర్చరీ పట్ల తన అంకితభావం, తన శిష్యులు సాధించిన జాతీయ, అంతర్జాతీయ విజయాలను వివరించి, క్రమశిక్షణతో ముందుకు సాగితే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. అర్జున అవార్డు గ్రహీత మంగళ్ సింగ్ చాంపియా మాట్లాడుతూ, కష్టపడి సాధన చేస్తే విజయాన్ని ఎవ్వరూ ఆపలేరని, పట్టుదలతో లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. తన క్రీడా ప్రస్థానాన్ని వివరించి యువతకు ప్రేరణనిచ్చారు. డా. ఘజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలుగు గజల్‌కు తాను చేసిన సేవలను ప్రస్తావిస్తూ, జీవితంలో కృతజ్ఞత (గ్రాటిట్యూడ్) భావం ఎంతో ముఖ్యమని వివరించారు. అనేక సవాళ్లను ఎదుర్కొంటూ లక్ష్యాలను సాధించిన తన అనుభవాలను పంచుకున్నారు. 125కు పైగా ప్రపంచ భాషల్లో గానం చేసి, 10 వేలకుపైగా ప్రదర్శనలు ఇచ్చిన విషయాన్ని పేర్కొన్నారు. నాగార్జున విశ్వవిద్యాలయాన్ని తనకు ఆలయంతో సమానమని భావిస్తున్నానని, తన పేరుకు ముందు "డాక్టర్" అనే గౌరవం రావడానికి ఈ విశ్వవిద్యాలయం ఆశీర్వాదం కారణమని తెలిపారు. విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవడానికి పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. ఆయన ఆలపించిన గజల్స్, ముఖ్యంగా "ఒక్కసారి ఊరు పోయిరా" వంటి గీతాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ సందర్భంగా వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ తమ వార్షిక నివేదికలను సమర్పించారు: ప్రొఫెసర్ కె. వీరయ్య (యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్సెస్), ప్రొఫెసర్ ఎం. సురేష్ కుమార్ (ఆర్ట్స్, కామర్స్ ఢ లా), ప్రొఫెసర్ పి. పి. ఎస్. పాల్ కుమార్ (ఫిజికల్ ఎడ్యుకేషన్ ఢ స్పోర్ట్స్ సైన్సెస్), ప్రొఫెసర్ కె. తేజోమూర్తి (ఫార్మాస్యూటికల్ సైన్సెస్), ప్రొఫెసర్ ఆర్.వి. నిరుపమ (ఆర్కిటెక్చర్ ఢ ప్లానింగ్) తమ కళాశాలల పురోగతిని వివరించారు. సైన్స్ కళాశాలలో 17 విభాగాలు, 25 కోర్సులు, వందలాది విద్యార్థులు ఉన్నారని, డాక్టరేట్‌లు ప్రదానం చేస్తున్నారని తెలిపారు. ఆర్ట్స్ కళాశాల చరిత్ర, జాతీయ స్థాయి విజయాలను వివరించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల క్రీడా విజయాలు, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్, ప్లేస్‌మెంట్స్, ఆర్కిటెక్చర్ కళాశాల సృజనాత్మక ప్రతిభను వివరించారు. ఓఎస్డీ ప్రొఫెసర్ ఆర్.వి.ఎస్.ఎస్.ఎన్. రవికుమార్ ఆధునిక ల్యాబ్‌లు, ఏఐ, ఎంఎల్ శిక్షణ కార్యక్రమాలను వివరించగా, రెక్టర్ ప్రొఫెసర్ ఆర్. శివరాం ప్రసాద్ విశ్వవిద్యాలయం సాధించిన మైలురాళ్లను ప్రస్తావించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. సింహాచలం విశ్వవిద్యాలయం గొప్పతనాన్ని వివరించారు. ముఖ్య అతిథి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె. గంగాధర్ రావు మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాల కోసం కృషి చేయాలని, నిరంతరం నేర్చుకుంటూ తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఫార్మసీ, ఆర్ట్స్, మేనేజ్‌మెంట్, ఆర్కిటెక్చర్ తదితర విభాగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని, అమరావతి ప్రాంతంలో కొత్త అవకాశాలు రూపుదిద్దుకుంటున్నాయని తెలిపారు. విశ్వవిద్యాలయం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో మంచి స్థానం సంపాదించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా విశిష్ట అతిథులను సత్కరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, వినోద ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా ప్రొఫెసర్ ఎం. త్రిమూర్తి రావు వ్యవహరించారు. ఐదు కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు భారీ సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# డేంజర్ జోన్‌లో సొరంగం!

**ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిన చోటుకు 6 కి.మీ. దూరంలో 'నల్లవాగు' మేజర్ ఫాల్ట్ జోన్**

**వాగుకు 2 కి.మీ. దూరంలోని సొరంగ మార్గంలో మరో రెండు ఫాల్ట్ జోన్లు**

**50--300 మీటర్ల లోతు వరకు శిలల మధ్య భారీ చీలికలు, పగుళ్లు..వీటి మధ్య జల ప్రవాహం**

**సీఎస్ఐఆర్--ఎన్జీఆర్ఐ శాస్త్రవేత్తల సర్వేలో వెలుగులోకి ఆందోళనకర అంశాలు**

**నల్లవాగు ప్రాంత పరిధిలోనే నిర్మాణం జరుగుతుండటంతో ఏర్పడిన ఫాల్ట్ జోన్లు**

**శిలల మధ్య పగుళ్లు, మధ్యలో మట్టి, నీటి ప్రవాహంతో గతంలో కూలిన సొరంగం**

**కూలిన ప్రాంతానికి పక్కన తీవ్ర పగుళ్లతో మరో రెండు ప్రమాదకర జోన్లు**



హైదరాబాద్: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం కుప్పకూలిన ప్రాంతానికి 6 కి.మీ.ల దూరంలో 'నల్లవాగు' మేజర్ ఫాల్ట్ జోన్ ఉన్నట్టు శాస్త్రవేత్తలు నిర్ధారించారు. నల్లవాగుకి 2 కి.మీ.ల తూర్పు, పడమర దిశలోని సొరంగ మార్గంలో మరో రెండు ఫాల్ట్ జోన్లు కూడా ఉన్నాయి. భూ ఉపరితలం నుంచి 50--300 మీటర్ల లోతుల్లో దక్షిణ దిశగా వాలుతూ ఈ ఫాల్ట్ జోన్లు కనిపించాయి. అక్కడి పొరల నిర్మాణంలో చీలికలూ ఉన్నాయి. సొరంగ మార్గం వెంబడి భూగర్భ జలాల ప్రవాహానికి ఈ చీలికలు ప్రధాన మార్గంగా పనిచేస్తున్నాయి. నల్లమల అటవీ ప్రాంతంలోని నల్లవాగు ప్రాంతం పరిధిలోనే సొరంగ నిర్మాణం జరుగుతుండడంతో ఈ ఫాల్ట్ జోన్లు ఏర్పడ్డాయి. సీఎస్ఐఆర్--నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ శాస్త్రవేత్తలు 2025 అక్టోబర్--నవంబర్ మధ్యకాలంలో అత్యాధునిక హెలీబోర్న్ వీటెమ్ సాంకేతికతతో ఆకాశం నుంచి భూగర్భంలో పరిశోధనలు నిర్వహించగా, పైన పేర్కొన్న రీతిలో పలు ఆందోళనకర అంశాలు బయటపడ్డాయి. ఈ సర్వే నివేదికను ఇటీవల ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్తలు రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు. అత్యాధునిక పరికరాల ద్వారా విద్యుదయస్కాంత సంకేతాలను భూగర్భంలోకి పంపించి వాటి వ్యాప్తిని గమనించడం ద్వారా భూ పొరల్లో ఫాల్ట్స్, ఫ్రాక్చర్లు, షీర్ జోన్లతో పాటు భూగర్భ జలాల ప్రవాహాన్ని ఈ పరిశోధన ద్వారా నిర్ధారిస్తారు.

### పగుళ్ల మధ్య ప్రవహిస్తున్న నీళ్లు

సొరంగం కుప్పకూలిన ప్రాంతంలో 13.65-- 13.95 కి.మీ.ల మార్గంలోని శిలల మధ్య తీవ్రమైన పగుళ్లు ఏర్పడి ఉండగా, వాటి మధ్య మట్టి నిక్షిప్తమై బలహీన నిర్మాణాన్ని కలిగి ఉంది. అక్కడి శిలలు చీలిపోయి నిటారున మడతపడి ఉండగా, పగుళ్ల మధ్య నీళ్లు ప్రవహిస్తున్నాయి. దీంతోనే సొరంగం కుప్పకూలినట్టు భావిస్తున్నారు. సొరంగం కూలిన ప్రాంతానికి పక్కన తీవ్ర పగుళ్లతో మరో రెండు ప్రమాదకర జోన్లను కూడా గుర్తించారు. ఈ పగుళ్ల మధ్య కూడా భూగర్భ జల ప్రవాహం కొనసాగుతోంది. సొరంగం మధ్య ప్రాంతంలో నల్లవాగు ఫాల్ట్ జోన్ ఉంది. ఇక ఉత్తర భాగంలో పగుళు _/చీలికలున్నాయి.

### ఉత్తరాన విద్యుదయస్కాంత క్షేత్రం

సొరంగం కూలిన ప్రాంతానికి ఉత్తరాన అసాధారణ రీతిలో అత్యల్ప విద్యుదయస్కాంత క్షేత్రం ఉన్నట్టు కనుగొన్నారు. (నల్లవాగు ఫాల్ట్ జోన్) సొరంగ మార్గంలో 13.2 కి.మీలు, 13.6 కి.మీలు, 13.9కి.మీ.ల వద్ద పగుళ్లు, చీలికలు ఉన్నాయి. వీటి మధ్య జలాలు ప్రవహిస్తున్నాయి.

### ఇక్కడ జాగ్రత్తగా వ్యవహరించాలి

సొరంగ మార్గం 21--23 కి.మీ.ల మధ్య 250 మీటర్ల లోతుల్లో శిలల నిర్మాణం లోహ ఖనిజాల నుంచి గ్రనైట్‌కు మారుతోంది. దీంతో ఇక్కడ తవ్వకాల సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని నివేదిక స్పష్టం చేస్తోంది. నల్లమలలోని తిరుమలపూర్‌కి ఉత్తరాదిన.. ఈశాన్యం నుంచి నైరుతి దిశగా మరో రెండు సమస్యాత్మక ప్రాంతాలున్నాయి. సొరంగం తవ్వకాలు జరగాల్సిన ప్రాంతాల్లో పగుళ్లు, చీలికలు పలు దిశల్లో విస్తరించి ఉన్నాయి. ఉపరితలం నుంచి 250 మీటర్ల లోతు వరకు ఇలాంటి నిర్మాణాలుండగా, వీటి గుండా భూగర్భ జలాలు ప్రవహిస్తున్నాయి.

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com
గురువారం - 30 - ఏప్రిల్ - 2026

## శ్రీ పద్మావతి అమ్మవారి వసంతోత్సవాలకు అంకురార్పణ..



తిరుచానూరు,మహి న్యూస్ , ఏప్రిల్ 29: తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో వసంతోత్సవాలకు బుధవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. సాయంత్రం 6 నుండి 7.30 గంటల వరకు పుణ్యాహవచనం, రక్షాబంధనం,



అంకురార్పణ, సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. ఏప్రిల్ 30 నుండి మే 2 వరకు వసంతోత్సవాలు జరుగనున్నాయి. భక్తులు రూ.150 చెల్లించి ఈ ఉత్సవాల్లో పాల్గొనవచ్చు. మే 1న ఉదయం 9.30 గంటలకు స్వర్ణ రథోత్సవం జరుగుతుంది. మూడు రోజుల పాటు మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 4.30 వరకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. రాత్రి 7.30 నుండి 8.30 వరకు అమ్మవారు నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపుగా విహరిస్తారు.ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, అర్చకులు బాబుస్వామి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు

## ఎన్‌హెచ్-40పై సంయుక్త తనిఖీలకు శ్రీకారం




నంద్యాల, మహి న్యూస్, ఏప్రిల్ 29 :- నంద్యాల జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలో జాతీయ రహదారుల్లో గుర్తించిన బ్లాక్ స్పాట్లపై సంబంధిత అన్ని విభాగాల అధికారులతో కలిసి సంయుక్త తనిఖీ కోసం నిర్వహించిన బస్సు యాత్రను జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ తో కలిసి జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జాతీయ రహదారులు గుర్తించిన బ్లాక్ స్పాట్లను పరిశీలించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ నంద్యాల జిల్లాను నెల రోజుల్లో 'ప్రమాద రహిత జిల్లా' గా తీర్చిదిద్దేందుకు "బ్లాక్ స్పాట్ పరిశీలన యాత్ర"ను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని పేర్కొంటూ, ప్రమాదాల నియంత్రణకు సమగ్ర చర్యలు అవసరమని కలెక్టర్ స్పష్టం చేశారు.

### ప్రమాదాల గణాంకాలు

జిల్లాలో రోడ్డు ప్రమాదాల సంఖ్య గత రెండేళ్లుగా పెరుగుతున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. 2024 సంవత్సరంలో మొత్తం 542 ప్రమాదాలు సంభవించగా, 271 మంది మృతి చెందారన్నారు. 2025లో ప్రమాదాల సంఖ్య 567కి పెరిగి, మరణాలు 296కి చేరాయన్నారు. ఈ పరిస్థితి పట్ల కలెక్టర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

### బ్లాక్ స్పాట్ల గుర్తింపు

జిల్లా వ్యాప్తంగా ప్రమాదాలు అధికంగా జరుగుతున్న 29 బ్లాక్ స్పాట్లను అధికారులు గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. వాటిలో ఎన్‌హెచ్-40పై 9, ఎన్‌హెచ్-44పై 7, నంద్యాల పట్టణ పరిధిలో 6, ఎన్‌హెచ్-340సీ మరియు 544డి పై కలిపి 7 బ్లాక్ స్పాట్లు ఉన్నాయన్నారు. ఈ బ్లాక్ స్పాట్లను త్వరితగతిన సరిదిద్దేందుకు నేషనల్ హైవేస్, ఆర్ అండ్ బి, పోలీస్, ట్రాన్స్‌పోర్ట్, ఆర్టీసీ శాఖల మధ్య సమన్వయం పెంచుతున్నట్లు తెలిపారు. వచ్చే ఒక నెలలో గుర్తించిన సమస్యలను పరిష్కరించి, నంద్యాల జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. వాహనదారులు వేగ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని, జంక్షన్ల వద్ద అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించడం, ద్విచక్ర వాహనదారులు డ్రైవర్‌తో పాటు వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కోరారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్‌గా ఈ "బ్లాక్ స్పాట్ పరిశీలన యాత్ర" నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను అధికారులు స్వయంగా పరిశీలించి తక్షణ చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పోలీస్ శాఖతో పాటు ఆర్ అండ్ బి, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) మరియు టోల్ గేట్ సిబ్బంది కలిసి పనిచేస్తున్నట్లు వివరించారు. జంక్షన్ల వద్ద వాహనాల వేగాన్ని తగ్గించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం, ముఖ్య ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు అమర్చడం, రాత్రి సమయంలో దృశ్యమానత పెంచేందుకు తగిన లైటింగ్ సౌకర్యాలు కల్పించడం వంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వచ్చే ఒక నెలలో అన్ని భద్రతా చర్యలను పూర్తి చేసి, నంద్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించడం ఈ యాత్ర ప్రధాన ఉద్దేశమని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఏఐ పీడీ బి. అశోక్ కుమార్, ఆర్ఈపీఎల్ ప్రాజెక్ట్ హెడ్ మదన్ మోహన్ వంగర, ఆర్ఈపీఎల్ ఆపరేషన్ మేనేజర్ శ్రీనివాసులు, ఆర్ఈపీఎల్ రూట్ మేనేజర్ నరియేరవారా రెడ్డి, ఆర్ అండ్ బి ఈఈ శ్రీధర్ రెడ్డి, సబ్ డివిజనల్ ఏఎస్పి, ప్రాంతీయ రవాణా అధికారులు, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల రక్షణ చట్టం తేవాలి

## జంగారెడ్డిగూడెంలో ధర్నా



ఏలూరు జిల్లా, మహి న్యూస్, ఏప్రిల్ 29 : చిత్తూరు జిల్లా వి.కోట ఆంధ్రజ్యోతి విలేకరి జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యను నిరసిస్తూ బుధవారం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం రెవెన్యూ డివిజనల్ అధికారిణి ఎం.వి.రమణకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో



ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యుడు వాసా సత్యనారాయణ మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి రిపోర్టర్ జగన్మోహన్ రెడ్డిని దారుణంగా, అతి కిరాతకంగా హతమార్చినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తేవాలని కోరారు. హతుడు జగన్మోహన్ రెడ్డి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి పరిహారం చెల్లించాలని, అతని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఆంధ్రజ్యోతి యాజమాన్యం కూడా విధి నిర్వహణలో బలైపోయిన జగన్మోహన్ రెడ్డి కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం చెల్లించాలని కోరారు. యాజమాన్యం అతని కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఎలక్ట్రానిక్ మీడియా జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షుడు మొడియం ప్రసాద్ మాట్లాడుతూ, ఆంధ్రజ్యోతి రిపోర్టర్ జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యకు పాల్పడిన వారిపై ఇక మీదట ఎవరైనా దాడులు చేయాలంటే భయపడే విధంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు కే.వీ రమణరావు, ఏపీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ మెంబర్ డి.వి భాస్కరరావు, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ఏలూరు జిల్లా కోశాధికారి పాలడుగుల రామకృష్ణ, ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి కె.వెంకట్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మనెల్లి గంగరాజు, సీనియర్ జర్నలిస్టులు వందవాసు శ్రీనివాస్, నందూరి కిషోర్ బాబు, నాగసూరి బాలసుబ్రమణ్యం, ఎం.చందు వెంకట్, జె.నరేష్, కంచర్ల శ్రీనివాస్, ఎస్.నాగరాజు, అందుగుల నానాజీ, తోట నాగబాబు, బడిగంటి మోహన్, కె.సురేష్, తెల్లం హేమంత్, ఫణి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

# జలధార పనులతో అప్పలరాజు చెరువుకు నవ కళ



కాకినాడ జిల్లా, మహి న్యూస్, ఏప్రిల్ 29 : కాకినాడ జిల్లా మెట్ట ప్రాంతం పెద్దాపురం మండలంలోని వాలు తిమ్మాపురం గ్రామంలోని అప్పలరాజు చెరువు ఒకప్పుడు పుష్కలంగా నీటితో నిండి జలకళతో తొణికిసలాడేది. ఈ చెరువు కింద దాదాపు రెండొందల ఎకరాల్లో వరి పొలాలు సాగవుతూ ఎటు చూసినా పచ్చదనం శోభిల్లేది .... సంవత్సరానికి రెండు పంటలు పండుతూ రైతుల జీవితాలు సంతోషంగా సాగేవి. సాగు నీటితో పాటు పశువులకు కూడా సమృద్ధిగా త్రాగు నీరు అందేది. కానీ కాలక్రమంలో పరిస్థితులు మారాయి. మెట్ట ప్రాంతంలో వర్షపాతం తగ్గిపోవడంతో చెరువులో చేరే నీరు తగ్గిపోయి, నీటి పరిమాణం గణనీయంగా పడిపోయింది. దీనితో గతంలో రెండు పంటలు పండిన భూముల్లో ప్రస్తుతం ఒక పంట సాగుచేయడం కూడా కష్టతరమౌతోంది. పంటలు తగ్గి ..ఆదాయం లేకపోవడంతో, కొన్ని రైతు కుటుంబాలు ఉపాధి కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. గత ఐదు సంవత్సరాలుగా చెరువు పూడిక తీయకపోవడం, నీటి సంరక్షణ పనులు జరగకపోవడంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. నీరు తగ్గింది... పంటలు పోయాయి... పశుసంపద కూడా తరిగిపోయింది. అయితే ఇప్పుడు పరిస్థితి మారుతోంది. జలవనరుల పునరుద్దరణకు కూటమి ప్రభుత్వం చేపట్టిన జలధార -జలహారతి కార్యక్రమం రైతుల కష్టాలకు చరమ గీతం పాడనుంది. దాదాపు 25 లక్షల రూపాయల జలధార నిధులతో వాలుతిమ్మాపురం అప్పలరాజు చెరువు పునరుద్దరణ పనులను ఇటీవల జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్ ప్రారంభించారు. పనులు చకచకా జరుగుతూ వాలు తిమ్మాపురం గ్రామం రైతుల మదిలో కొత్త ఆశలు చిగురింప చేస్తున్నాయి. పెద్దాపురం మండలం, వాలుతిమ్మాపురం గ్రామంలో 7.2 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న అప్పలరాజు చెరువు పూడిక తీత, చెరువు గట్టు బలోపేతం చేసే తొలివిడత పనులు రూ. 9 లక్షల 83 వేలు జాతీయ ఉపాధి హామీ పథకం ( వీబీ జీ రామ్ జీ పథకం) నిధులతో జలధార-జలహారతి పథకం క్రింద జరుగుతున్నాయి. ప్రతి రోజూ 140 నుండి 150 మంది ఉపాధి శ్రామికులు ఈ చెరువు పూడిక తీత పనుల్లో పాల్గొంటున్నారు. తొలివిడత పనులు పూర్తయిన వెంటనే మరో 10 లక్షల నిధులతో రెండవ దశ పనులను ప్రతిపాదించారు. ఈ పనులతో అప్పలరాజు చెరువు నీటి నిల్వ సామర్థ్యం 0.165 NGFP ( No Gross Fixed Percentage) కి పెరిగి దాదాపు 150 ఎకరాలలో వరితో పాటు, జీడిమామిడి, మామిడి, పామాయిల్ తోటలకు ఆధారపడదగిన సాగునీటి వసతి అభివృద్ధి కానుంది. అప్పలరాజు చెరువులో జరుగుతున్న పనుల పట్ల వాలుతిమ్మాపురం, పరిసర గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాలుతిమ్మారం గ్రామ రైతు పిల్లి చంటమ్మ మాట్లాడుతూ తమ గ్రామంలో పలు కుటుంబాలకు వ్యవసాయమే ఆధారమని, గత ప్రభుత్వం చెరువుల నిర్వహణ పట్టించుకోక పోవడంతో పంటలకు నీరు లేక రైతుల జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. జీవనం కోసం పలు రైతు కుంటుంబాలు, నిర్మాణ కూలీలుగా పొట్టపోసుకునేందుకు పట్టణాలకు, హైదరాబాద్ లాంటి నగరాలకు తరలి వెళ్లారన్నారు. కూటమి ప్రభుత్వం జలధార-జల హారతి కార్యక్రమం పనుల ద్వారా అప్పలరాజు చెరువుకు పూర్వ వైభవం తేవడం ఎంతో ఆనందం కలిగిస్తోందని, ఈ పనులతో చెరువుకు మరల జలసిరి రావడంతో బాటు, పనుల కోసం ఎక్కడెక్కడికో వలసవెళ్లిన కుటుంబాలు తిరిగి వచ్చి వాలుతిమ్మాపురం గ్రామంలో కూడా వెనకటి సందడి, సంతోషాలతో పండుగ వాతావరణం మరల వస్తుందని మహిళా రైతు చంటమ్మ ఆనందంతో అన్నారు. మరో రైతు మైనపాటి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అప్పలరాజు చెరువు నిండితే తమ ప్రాంతంలోని వరి, జీడిమామిడి, మామిడి, పామాయిల్ రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఆలాగే చెరువు నీటి వల్ల భూగర్భ జలాలు కూడా పెరుగుతాయాని, అందువల్ల బోర్లు, హాండ్ పంప్ ల ద్వారా త్రాగునీరు కూడా సమృద్ధిగా లభిస్తుందన్నారు. ఇకపై తమ గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల పాడి రైతుల పశువులకు కూడా ఈ చెరువు దాహార్తి తీరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేసారు.. అప్పలరాజు చెరువు పునరుద్దరణ మా జీవితాలనే మార్చనుందని రైతు రాజ్యలక్ష్మి సంతోషం వెలిబుచ్చారు. జలధార పునరుద్ధరణ పనులతో అప్పలరాజు చెరువులో మళ్లీ నీరు నిండి వాలుతిమ్మాపురం గ్రామ ప్రజల జీవితాలలో సంతోషాలు వెల్లువెత్తనున్నాయని సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. జలధార పనులతో మా ఊరి చెరువు .. ఈ వాన కాలం లోపు మళ్లీ నవజీవం పోసుకోబోతుంది .. జలధార జలాలతో మా నేలమ్మ తల్లి పై మా వరి పైర్లు నిత్యం పచ్చదనంతో కళకళాడబోతున్నాయి.. మా జీవితాలు, పాడి పంటలతో మళ్లీ బాగుపడతాయి.. మా భూములను సస్యశ్యామలం, మా జీవితాలను కాంతిమయం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి చెయ్యెత్తి మొక్కుతున్నాం...అన్నారు వాలు తిమ్మాపురం గ్రామ రైతులు. చెరువు పునరుద్దరణ పనులు పూర్తి అయిన వెంటనే చెరువుకు జలహారతి .. కూటమి ప్రభుత్వానికి జన హారతి ఇచ్చి.. మా రుణం తీర్చుకుంటాం ..అని వాలు తిమ్మాపురం రైతన్నలు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. జలధార -- జల హారతి కారక్యక్రమం ద్వారా ఈ మార్పుకు నాంది పలికిన కూటమి ప్రభుత్వానికి వాలు తిమ్మాపురం రైతులు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

# టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు చేపట్టిన నారా లోకేష్




మంగళగిరి, మహి న్యూస్, ఏప్రిల్ 29 : తెలుగుదేశం పార్టీలో మరో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేష్ కు పలువురు నేతలు అభినందనలు తెలిపారు. పార్టీ కేంద్ర కార్యాలయంలోని తన చాంబర్ లో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు మంత్రి నారా లోకేష్ ను కలిసి అభినందనలు తెలిపారు. టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యనిర్వాహక అధ్యక్షులుగా నారా లోకేష్ పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా నేతలు ఆకాంక్షించారు. అంతకుముందు ఎంపీ, టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి నారా లోకేష్ సమక్షంలో కేక్ కట్ చేశారు. శ్రీకృష్ణదేవరాయలకు కేక్ తినిపించి మంత్రి నారా లోకేష్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## షార్జా నుండి ఇంటికి క్షేమంగా తిరిగి వచ్చిన జిల్లా వాసి



కాకినాడ, మహి న్యూస్, ఏప్రిల్ 29 : ఉపాధి కొరకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కు వెళ్లి అనారోగ్యంతో బాధపడుతూ, పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల వల్ల షార్జాలో చిక్కుకున్న కాకినాడ జిల్లా, పెద్దాపురం మండలం, దివిలి గ్రామని చెందిన యువకుడు పులిగే చిన సన్యాసి రావు జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వ సంస్థ ఏపి నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీల చొరవతో తిరిగి తన స్వగ్రామం సురక్షితంగా చేరుకున్నాడు. దిక్కుతోచని అసహాయ పరిస్థితిలో అల్లాడుతున్న తనను ఆదుకున్నందుకు పులిగే చిన సన్యాసిరావు, అతని కుటుంబ సభ్యులు జిల్లా యంత్రాంగానికి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ మేరకు బుధవారం సన్యాసిరావు, అతని కుటుంబ సభ్యులు జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ను కలిసి ధన్యవాదాలు తెలియజేసారు.

### షార్జా నుండి ఇంటికి క్షేమంగా తిరిగి వచ్చిన జిల్లా వాసి

కాకినాడ, 29.4.2026: ఉపాధి కొరకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కు వెళ్లి అనారోగ్యంతో బాధపడుతూ, పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల వల్ల షార్జాలో చిక్కుకున్న కాకినాడ జిల్లా, పెద్దాపురం మండలం, దివిలి గ్రామని చెందిన యువకుడు పులిగే చిన సన్యాసి రావు జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వ సంస్థ ఏపి నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీల చొరవతో తిరిగి తన స్వగ్రామం సురక్షితంగా చేరుకున్నాడు. దిక్కుతోచని అసహాయ పరిస్థితిలో అల్లాడుతున్న తనను ఆదుకున్నందుకు పులిగే చిన సన్యాసిరావు, అతని కుటుంబ సభ్యులు జిల్లా యంత్రాంగానికి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ మేరకు బుధవారం సన్యాసిరావు, అతని కుటుంబ సభ్యులు జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ను కలిసి ధన్యవాదాలు తెలియజేసారు.

# మే 9న జాతీయ లోక్ అదాలత్



శ్రీకాకుళం, మహి న్యూస్, ఏప్రిల్ 29: జిల్లావ్యాప్తంగా మే 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని వివిధ కోర్టుల్లో మొత్తం 19 బెంచీలను ఏర్పాటు చేశామని, రాజీ పడదగ్గ 4,576 కేసులను ఈ అదాలత్ కోసం గుర్తించినట్లు ఆయన తెలిపారు. రాజీ మార్గం ద్వారా ఇరుపక్షాలకు విజయం చేకూరుతుందని దీనివల్ల అటు ధనం ఆదా అవ్వడమే కాకుండా ఇటు సమయం కూడా వృధా కాదని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారమైతే కక్షిదారులు గతంలో చెల్లించిన కోర్టు ఫీజును తిరిగి పొందే వెసులుబాటు ఉంటుందని, ఇది సామాన్యులకు ఎంతో మేలు చేస్తుందని వివరించారు. సమ న్యాయం, సత్వర పరిష్కారమే లక్ష్యంగా సాగే ఈ కార్యక్రమంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, సీనియర్ సిటిజన్ల వివాదాలు, వైవాహిక తగాదాలు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు న్యాయమూర్తి తెలిపారు. వీటితో పాటు ఎగ్జిక్యూషన్ పిటిషన్లు, అండర్ ట్రయల్ కేసులు కూడా పరిష్కారానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ లేకుండా, పరస్పర అంగీకారంతో వివాదాలను ముగించుకుని సత్వర న్యాయం పొందడానికి ఇదొక చక్కని వేదికని, జిల్లాలోని కక్షిదారులు ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

## వడ్లమూరు గ్రామంలో కళ్ళాలలో ధాన్యం అరబెట్టుకున్న రైతులతో ముచ్చటించిన జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్..



పెద్దాపురం, మహి న్యూస్, ఏప్రిల్ 29 : బుధవారం పెద్దాపురం మండలం వడ్లమూరు గ్రామంలోని రైతు.. కళ్ళంలో అరబెట్టుకున్న ధాన్యాన్ని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్.. పౌరసరఫరాల సంస్థ అధికారులు, వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. వరి కోత యంత్రం ద్వారా సాగుతున్న కోత పనుల వివరాలను రైతులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. వరి కోత యంత్రం పనితీరును పరిశీలించి, వివరాలు ఆరా తీశారు. కోత అనంతరం ధాన్యం, కళ్ళంలో ఆరబోసిన ధాన్యం తేమ శాతం వ్యత్యాసాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ.. జిల్లాలో రద్ధిగా రబీ పంట కోత పనులు జరుగుతున్నాయన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియ సక్రమంగా జరిగేందుకు జిల్లా అధికార యంత్రాంగం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రైతులు ధాన్యం కనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు పాటించి, తప్పనిసరిగా కనీస మద్దతు ధర పొందాలని ఆయన కోరారు. తేమశాతం సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, దళారులు మధ్యవర్తులు బారిన పడకుండా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని జేసీ తెలిపారు. ఈ పర్యటనలో జేసీ వెంట జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.దేవులానాయక్, పెద్దాపురం తహసీల్దార్ లక్ష్మి ఏడీఏ కే.దుర్గా లక్ష్మీ, రైతు సేవా కేంద్ర సిబ్బంది, ఇతర అధికారులు ఉన్నారు.

# 8న డిజాస్టర్ మేనేజ్మెంట్పై శిక్షణ



శ్రీకాకుళం, మహి న్యూస్, ఏప్రిల్ 29: నగరంలోని మే 8న డిజాస్టర్ మేనేజ్మెంట్పై రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని జిల్లా చైర్మన్ పి.జగన్మోహన్ రావు తెలిపారు. ఈమేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. 18 నుంచి 45 ఏళ్ల మధ్య వారు శిక్షణకు హాజరుకావచ్చు న్నారు. శిక్షణకు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, మరిన్ని వివరాలకి 9440490525, 9948633398 లను సంప్రదించి ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాల న్నారు. ఈ అవకాశాన్నిఅందరూసద్వినియోగం చేసుకోవాలని జగన్మోహనరావు కోరారు.

## మే 5న రణస్థలంలో మెగా జాబ్ మేళా

రణస్థలం, మహి న్యూస్, ఏప్రిల్ 29: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మే 5వ తేదీన రణస్థలంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలో జరిగే ఈ మేళాలో టాటా ఎలక్ట్రానిక్స్, స్నైడర్ ఎలక్ట్రిక్, మ్యాన్‌కైండ్ ఫార్మా వంటి 14 ప్రముఖ ప్రైవేట్ కంపెనీలు పాల్గొని సుమారు 675 ఖాళీలను భర్తీ చేయనున్నాయి. పదో తరగతి నుంచి డిగ్రీ, బీటెక్ చదివిన 18-30 ఏళ్ల మధ్య వయసున్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఎంపికైన వారికి శ్రీకాకుళం, విశాఖపట్నం, హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు ముందుగా ఋఅజూబఅఋఎ.ఖజూ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలని, ఇంటర్వ్యూ రోజున ఉదయం 9 గంటలకే విద్యార్హత పత్రాలు, ఆధార్, రెజ్యూమే, ఫోటోలతో హాజరుకావాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ సూచించారు. ఎంపికైన వారికి పోస్టును బట్టి నెలకు రూ. 10,000 నుండి రూ. 25,000 వరకు వేతనం ఉంటుందని, కొన్ని కంపెనీలు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కూడా కల్పిస్తాయని తెలిపారు. ఇతర వివరాలకు 8317652552 నంబరును సంప్రదించాలని కోరారు.

## మే 1 న కాకినాడ- మైసూర్ రెగ్యులర్ ట్రైన్ ప్రారంభం

**కాకినాడ, మహి న్యూస్, ఏప్రిల్ 29 : మే ఒకటో తేదీ నుండి కాకినాడ - మైసూర్ రెగ్యులర్ ట్రైన్ ప్రారంభం కానుంది. ఒకటో తేదీ ఉదయం 9 గంటలకు కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్లో కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ జెండా ఊపి రైలు సర్వీసును లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఇప్పటివరకు వారానికి రెండు రోజులు పాటు ప్రత్యేక రైలుగా నడిచిన ఈ సర్వీసును ప్రయాణికుల డిమాండ్ మేరకు రెగ్యులర్ ట్రైన్ గా నడపాలని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ పలుమార్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను కలిసి విజ్ఞప్తి చేయడంతో సానుకూలంగా స్పందించి ప్రత్యేక రైలును రెగ్యులర్ ట్రైన్ గా మార్పు చేయడం జరిగింది.**

RNI : APTEL/25/A0108
epaper: https://epaper.mahinewsindia.com

# ఉచిత కంటి పొర చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం

### ఉచిత కంటి చికిత్స శిబిరాన్ని ప్రారంభించిన వైయస్ మనోహర్ రెడ్డి



పులివెందుల మహి న్యూస్ ఏప్రిల్ 29: ఉచిత కంటి పొర చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అని వైకాపా మున్సిప ల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, మాజీ మున్సిప ల్ చైర్మన్ వరప్రసాద్ లు అన్నారు. బుధవారం స్థానిక బాకరాపురంలోని వెంకటప్ప మెమోరియల్ పాఠశాలలో కంభం తిరుమలరెడ్డి ధర్మపత్ని రామ లక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటిపుర చికిత్స కార్యక్రమాన్ని వైకాపా మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకర్ నేత్రా లయ పుట్టపర్తి, కంభం తిరుమలరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఐదో తేదీ వరకు ఉచిత కంటి పొర చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింద న్నారు. ప్రతి ఏటాకంభం తిరుమలరెడ్డి ధర్మపత్ని రామ లక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు తిరుమల్ రెడ్డి ఉచిత కంటి చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు. కంటి పరీక్షలు నిర్వహించుకున్న వారికి మాత్రలు, అద్దాలు, ఉచితంగా అందజేయడంతోపాటు వారికి భోజన సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ మెంబర్ చంద్ర మౌళి, వైకాపా నాయకులు కొంగనపల్లి రవి, పద్మనాభ రెడ్డి, కొమ్మది నరసింహారెడ్డి, చెన్నూరు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయమే గెలిచింది

### 101 టెంకాయలు కొట్టిన వైకాపా నాయకులు



పులివెందుల మహి న్యూస్ ఏప్రిల్ 29: పులివెందుల పట్టణంలోని తూర్పు ఆంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం వైయస్ భాస్కర్ రెడ్డికి ఫ్రీబెయిల్ వచ్చిన సందర్భంగా కడియాల లక్ష్మి బ్రదర్స్ఆధ్వర్యంలో 101 టెంకాయ కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు . ముందుగా ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో 101 టెంకాయ లు కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీతి నిజాయితీ గెలిచిందని వారన్నారు. చేయని నేరానికి శిక్ష అనుభవించడం జరిగిందన్నారు. మంగళవారం పులివెందుల నియోజకవర్గం ఇంచార్జ్ భాస్కర్ రెడ్డికి ఫ్రీ బెయిల్ రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. నీతి నిజాయితీ నిదానంగా తెలుస్తుందన్నారు. కొంగనపల్లి మురళి, సోపాల వీర, వెంకటసుబ్బయ్య, బ్యాటరీల ప్రసాద్, మాజీ కౌన్సిలర్ ఖాదర్, హరి, అంబక పల్లె బాలుడు తదితర వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# "ఆరోగ్య భద్రత అందరికీ పేదల కోసం ఆశాకిరణం ఆయుష్మాన్ భారత్"

### నేడు ఆయుష్మాన్ భారత్ దివాస్





పులివెందుల /తొండూరు మహి న్యూస్ ఏప్రిల్ 29:: దేశంలోని ప్రతి పౌరుడికి సమాన ఆరోగ్య హక్కు అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ ప్రాముఖ్యతను గుర్తుచేస్తూ ఆయుష్మాన్ భారత్ దివాస్‌ను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆరోగ్య సేవలు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలనే దిశగా ఈ పథకం ఒక విప్లవాత్మక అడుగుగా నిలిచింది. 2018లో భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు జీవన రక్షణగా మారింది. ప్రతి అర్హ కుటుంబానికి సంవత్సరానికి ?5 లక్షల వరకు ఉచిత వైద్య బీమా కల్పించడం ద్వారా చికిత్స ఖర్చుల భారం తగ్గి, పేద ప్రజలకు విశ్వాసం పెరిగింది. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు గుర్తింపు పొందిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా చికిత్స పొందే అవకాశం ఉండటం ఈ పథకానికి విశేషమైన ప్రత్యేకత. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఇది మరింత సహాయకారిగా మారింది. గంభీర వ్యాధులు, అత్యవసర శస్త్రచికిత్సలు కూడా ఈ పథకం ద్వారా అందుబాటులోకి రావడం గమనార్హం. ప్రస్తుతం వైద్య సేవలు ఖరీదైన నేపథ్యంలో, ఆయుష్మాన్ భారత్ పథకం సామాన్య ప్రజలకు ఒక బలమైన ఆర్థిక రక్షణ కవచంగా నిలుస్తోంది. అనారోగ్యం వల్ల కుటుంబాలు అప్పుల బారిన పడే పరిస్థితిని ఇది గణనీయంగా తగ్గిస్తోంది. మొత్తానికి, ఆరోగ్య సేవలను ప్రతి పౌరుడి హక్కుగా గుర్తించి అందించాలనే సంకల్పానికి ఈ పథకం బలమైన మద్దతుగా నిలుస్తోంది. ఆయుష్మాన్ భారత్ దివాస్ ఆరోగ్య సమానత్వానికి ప్రతీకగా నిలుస్తూ, ఆరోగ్యవంతమైన భారత నిర్మాణానికి మార్గం సుగమం చేస్తోంది.

# నిరుద్యోగ భృతి ఎప్పుడు?

పులివెందుల /తొండూరు మహి న్యూస్ ఏప్రిల్ 29 : ఎన్నికల ముందు ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీ అమలు కాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది నిరుద్యోగ యువత తీవ్ర నిరాశలో ఉన్నారు. తొండూరు మండలంలోనూ డిగ్రీ,పీజీ,బీటెక్ చదివి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వందలాది మంది యువతీ యువకులు 'భృతి ఊసే లేదు'అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంతో ఆశపడ్డ వేలాది మంది యువత గ్రామ,వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు సమర్పించారు. కానీ సంవత్సరం గడుస్తున్నా భృతి జాడ లేదు,దరఖాస్తుల పరిస్థితి ఏమిటో కూడా తెలియడం లేదు. "డిగ్రీ అయిపోయి 3 ఏళ్లు అవుతోంది. ఉద్యోగం రాలేదు. కనీసం భృతి వస్తే కోచింగ్ తీసుకోవడానికి,పరీక్ష ఫీజులు కట్టుకోవడానికి ఉపయోగపడుతుంది. కానీ అధికారులు అడిగితే 'పై నుంచి ఆదేశాలు రాలేదు'అంటున్నారు" ఉద్యోగం లేక,భృతి రాక తల్లిదండ్రులపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాలకు వయోపరిమితి దాటిపోతోందని ఆందోళన. సమాజంలో చిన్నచూపు,ఇంట్లో ఒత్తిడితో డిప్రెషన్‌లోకి వెళ్తున్నారు.

# ఆరాధన మహోత్సవాల సందర్భంగా అన్నదానానికి సహకరించిన పట్రా కులస్తుల దాతలందరికీ కృతజ్ఞతలు

### పట్రా అన్నదాన సదనం అధ్యక్షులు తిప్పన బ్రహ్మయ్య




బ్రహ్మంగారి. మఠం. మహి న్యూస్. ఏప్రిల్ :29: ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన ఆరాధన మహోత్సవాల సందర్భంగా,మన పట్రా నాయుళ్ల అన్నదాన సత్రం నందు 26, 27.26వ తారీఖున శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారు జీవ సమాధి పొందిన సుదినం,27వ తారీఖున శ్రీ గోవింద మాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారు బ్రహ్మరథం పై ఊరేగిన పవిత్ర సుదినంతేదీలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ అన్నదాన కార్యక్రమం గురించి మన పట్రా అన్నదాన సదనం గ్రూపులలో తెలియజేసిన వెంటనే స్పందించి డబ్బులు పంపిన మన పట్రా కులస్తులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు,కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.అలాగే ముఖ్యంగా రేకులకుంట గ్రామ పంచాయతీలోని అన్ని గ్రామాలలో ఉన్న మన పట్రా కులస్తులు ఈ అన్నదాన కార్యక్రమానికి వారికి తోచిన మటుకు డబ్బు,ఒడ్లు సహాయం అందించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.అలాగే కొమరోలు మండలంలోని మన పట్రా కులస్తులు అన్నదానానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.ఆంధ్రప్రదేశ్ లోని ఏ జిల్లా నుంచైనా ఫోన్ పే ద్వారా గాని స్కానర్ ద్వారా గాని పంపిన ప్రతి ఒక్క పట్రా కులస్తులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు,ధన్యవాదాలు తెలుపుకుంటున్నాము.ఈ అన్నదాన కార్యక్రమంలో రెండు రోజులపాటు ప్రత్యక్షంగా ఇక్కడే ఉండి సహకరించిన రాజా నాయుడు కి,భూతప్ప నాయుడు కి,మాజీ డీలర్ గంగి నాయుడు కి,మలికె శ్రీనివాసులు కిటీచర్,వై.పెంచలయ్య కిరిటైర్డ్ టీచర్తి.తి ప్పన పవన్ కుమార్ కి,దొనపాటి పార్థసారథి కి,ముఖ్యంగా సత్రం డైరెక్టర్లు గడ్డం గంగి నాయుడు కి,తిప్పన మాధవ నాయుడు కి,సారే రామానాయుడు కి,పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.అన్నదానానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాము.

# జలధార కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించాలి..!

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి




కడప, మహి న్యూస్ ఏప్రిల్ 29 : జలధార కార్యక్రమంలో భాగంగా అన్ని మండలాల్లో నీటి భద్రతా చర్యల ప్రణాళికలను పటిష్టంగా అమలు చేసి.. వంద శాతం లక్ష్యాలను అధిగమించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సభా భవన్ లో



జిల్లా కలెక్టర్ డా. శ్రీదర్ చెరుకూరి.. 'జలధార.. నీటి భద్రత- సాగు నీటి సంఘాల బాధ్యత' అమలు ప్రణాళిక, అమలు పురోగతిపై.. డిఎఫ్ఓ వినీత్ కుమార్ తో కలిసి సంబంధిత అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపిడివోలు, భూగర్భజల శాఖ ఇంజినీర్లు, డ్వామా ఏపీవోలతో సమీక్షించారు. జిల్లాలో భూగర్భ జలాలు మట్టాన్ని పెంపొందించడం, నీటి వనరులు సంరక్షణ, సాగునీటి వ్యవస్థ బలోపేతం లక్ష్యంగా క్షేత్రస్థాయిలో అవసరాలను గుర్తించాలన్నారు. అందులో భాగంగా నీటి వనరులను గుర్తించడం నీటి భద్రత, సాగునీటి పొదుపు, కొత్త ఆయకట్టు మదుపు, వాగులు, చెరువుల అనుసంధానం, సూక్ష్మ సేద్యం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం.. తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు ఇప్పటికే అన్ని మండలాలకు సంబంధించి చేపట్టాల్సిన పనుల వివరాలను పరిశీలించి అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రాధాన్యతను అనుసరించి సాగునీటి కాలువలు, చెరువులు గట్లను బలోపేతం చేయడం, కాలువల పూడికతీత, లాక్స్ మరమ్మతులు వంటి పనులను ఇప్పటికే గ్రౌండింగ్ చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో చెక్ డ్యాములు, రోడ్డు పక్కన ఉన్న కాల్వల డైవర్షన్ వంటి పనులు చేసి ఉంటే గుర్తించి.. క్లియర్ చేసేందుకు ఎన్ఆర్ఈజిఎస్ ద్వారా పనులను గుర్తించి నివేదికలు సమర్పించి అనుమతులు పొందాలన్నారు. గ్రామ పరిసరాల్లో ఉన్న చెరువులు, కుంటలు, కాల్వలలో పిచ్చి మొక్కలు,



కంపచెట్లను తొలగింపు, చెరువులు, కాలువల అనుసంధానం, భూగర్భ జలాల సంరక్షణ కోసం సూక్ష్మ నీటి సాగును ప్రోత్సహించడం స్లూయిజ్ కాల్వల రిపేరీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కాస్కెట్ ట్యాంక్ లు, తాత్కాలికంగా మళ్లింపు చేసిన కాలువలను గుర్తించి పునరుద్ధరణ పనులను చేపట్టాలన్నారు. ఈ పనుల్లో ప్రజలు ముఖంగా మహిళా రైతులు, డ్వాక్రా మహిళలు భాగస్వామ్యంతో పనులను వేగవంతంగా, నాణ్యతగా చేపట్టాలన్నారు. సాగునీటి సంఘాలను పటిష్టం చేసి జలవనరులు శాఖ, అటవీ శాఖ, పంచాయతీ రాజ్, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలు, డ్వామా తదితర



శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట సబ్ కలెక్టర్ భావన, కెఎంసి కమిషనర్ రాకేష్ చంద్రం, జెడ్పి సీఈవో రామచంద్రారెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ అబ్దుస్, డ్వామా పీడి అదిశేషారెడ్డి, సీపీవో హాజరతయ్య, అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడివోలు, మండల ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో "కిశోరి వికాసం" కార్యక్రమాన్ని సమగ్రంగా నిర్వహించాలి..!

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

### కిశోరీ వికాసంపై జిల్లా స్థాయి కన్వర్జెన్స్ సమావేశం



కడప, మహి న్యూస్ ఏప్రిల్ 29: జిల్లాలో "కిశోరి వికాసం" కార్యక్రమాన్ని సమగ్రంగా, సమన్వయంతో అమలు చేసి బాల బాలికల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పాటుపడాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జిల్లా స్థాయి కన్వర్జెన్స్ సమావేశం జరిగింది. సమావేశంలో ఐసిడిఎస్ పీడి రమాదేవి కార్యక్రమ ప్రణాళికను జిల్లా కలెక్టర్ కు క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. "కిశోరి వికాసం"పై వేసవి ప్రత్యేక ప్రచారం-2026లో భాగంగా మే 1 నుంచి జూన్ 10 వరకు ఈ కార్యక్రమాన్ని గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు.. 11 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల కిశోరుల సాధికారతే ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు. విద్య, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, పోషణ, బాలల రక్షణ చట్టాలపై అవగాహన, ఆర్థిక సాక్షరత, కెరీర్ మార్గదర్శనం, సైబర్ భద్రత, లైఫ్ స్కిల్స్ వంటి అంశాలపై ప్రత్యేక సెషన్లు నిర్వహిస్తారన్నారు. ప్రతి వారం గురువారం, శుక్రవారం కమ్యూనిటీ హాళ్లు లేదా సచివాలయాల్లో సెషన్లు నిర్వహించడంతో పాటు, బుధవారం మరియు శనివారం పాఠశాలల్లో కూడా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 వరకు బాలికల "సఖి" గ్రూపులకు, మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 వరకు బాలుర "యువ" గ్రూపులకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రూపులో 15



నుంచి 20 మంది సభ్యులు ఉండేలా ఏర్పాటు చేసి, సమర్థవంతమైన చర్చలు, పరస్పర భాగస్వామ్యం కల్పిస్తామన్నారు. విభిన్న శాఖల సమన్వయం ఈ కార్యక్రమ విజయానికి కీలకమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆరోగ్య శాఖ ద్వారా రక్తహీనత పరీక్షలు, ఐరన్, ఫోలిక్ యాసిడ్ పంపిణీ, మెన్స్ట్రువల్ హైజీన్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యాశాఖ ద్వారా కెరీర్ మార్గదర్శనం, స్కాలర్‌షిప్ అవగాహన, డ్రాప్‌అవుట్ విద్యార్థుల పునఃప్రవేశంపై దృష్టి సారిస్తామని చెప్పారు. పోలీస్ శాఖ ద్వారా సైబర్ భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. అలాగే స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ ద్వారా నైపుణ్య శిక్షణ, యువ సేవలు మరియు క్రీడల శాఖ ద్వారా క్రీడా పోటీలు, నాయకత్వాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. గ్రామ స్థాయి కమిటీల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచి, అవసరమైన వేదికలు, సదుపాయాలు కల్పించాలని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలకు సూచించారు. ఈ వేసవి శిబిరంలో స్వీయ అవగాహన, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, భావోద్వేగాల నిర్వహణ, ఆర్థిక నిర్వహణ, విద్య ప్రాముఖ్యత, సైబర్ భద్రత వంటి అంశాలపై రోజువారీ థీమ్‌లతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వివరించారు. చివరిదశలో పిల్లల గ్రామసభలు నిర్వహించి బాల్య వివాహాల నిరోధం, బాలికల భద్రత, విద్యాభివృద్ధి వంటి అంశాలపై గ్రామ స్థాయి నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని అన్ని సంబంధిత శాఖల అధికారులు ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి సమన్వయంతో పనిచేయాలని, ప్రతి స్థాయిలో బాధ్యతలను స్పష్టంగా నిర్వహించుకుంటూ ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో మురళి, జెడ్పి సీఈవో రామచంద్రారెడ్డి, ఐసిడిఎస్ పీడి రమాదేవి, డీఈవో శంశుద్దీన్, స్టెప్ సీఈవో జోయల్ విజయ్ కుమార్, సోషల్ వేల్ఫేర్, వైద్యారోగ్య శాఖ, సఖి, ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కల దాడిలో 40 గొర్రెలుమృతి, రైతుకు భారీనష్టం



రాయచోటి, మహిన్యూస్, ఏప్రిల్ 29: రామాపురం మండలంలోని హరిజనవాడలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పిల్లిండ్ల ఆంజనేయులు కుటుంబానికి చెందిన గొర్రెల మందపై వీధి కుక్కల గుంపు దాడి చేయడంతో సుమారు 40 గొర్రెలు చనిపోయాయి. గ్రామస్తుల సమాచారం మేరకు ఈ ఘటన రాత్రి సమయంలో జరిగింది. ఒక్కసారిగా కుక్కల గుంపు గొర్రెల మందపై దాడి చేయడంతో పశువులు తీవ్రంగా గాయపడి మృతి చెందాయి. ఉదయం రైతులు గమనించే సరికి 40 గొర్రెలు చనిపోయినట్లు గుర్తించారు.ఈ ఘటనలో గొర్రెల యజమాని పిల్లిండ్ల ఆంజనేయులకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లింది. మృతి చెందిన గొర్రెల విలువ సుమారు రూ. 4 లక్షల నుండి రూ. 5 లక్షల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు.ఇటీవల గ్రామీణ ప్రాంతాల్లో వీధికుక్కల దాడులు పెరుగుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా పశువులపై దాడులు జరుగుతుండటంతో తమ జీవనోపాధి ప్రమాదంలో పడుతోందని వారు చెబుతున్నారు. ఈ ఘటనపై గ్రామస్తులు సంబంధిత అధికారులకు సమాచారం అందించి, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సంఘటనా స్థలాన్ని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అన్నమయ్య జిల్లా కార్యదర్శి వంగమల్ల రంగారెడ్డి సందర్శించి బాధితులతో మాట్లాడి జరిగిన విషయం తెలుసుకున్నారు. సంఘటనపై రంగారెడ్డి స్పందిస్తూ పేదరైతులకు ఇది కోలుకోలేని దెబ్బ అన్నారు. ఈ దారుణ సంఘటనను మంత్రి రాంప్రసాద్ రెడ్డి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరుగునట్లు చూస్తామన్నారు. స్థానిక అధికారులు పూర్తినష్టాన్ని నివేదికలు తయారుచేసి పైఅధికారులకు పంపాలని, అలాగే బాధిత రైతుకు తక్షణ నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అన్నయ్య, కదిరప్ప, బాబు, చిన్నప్ప, నాగులయ్య, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమానికి 4 పథకాల పునరుద్ధరణ




కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 29: జిల్లాలోని భవన మరియు ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, గౌరవనీయులైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారి ఆదేశాల మేరకు నాలుగు ముఖ్యమైన సంక్షేమ పథకాలను పునరుద్ధరించడంతో పాటు 01-03-2026 నుండి అమల్లోకి తీసుకువచ్చినట్లు జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...భవన మరియు ఇతర నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నదన్నారు. ఈ పథకాల ద్వారా వివాహ కానుకగా రూ.20,000/-, ప్రసూతి సహాయంగా రూ.20,000/-, సహజ మరణానికి రూ.60,000/- మరియు అంత్యక్రియల ఖర్చులకు రూ.20,000/- ఆర్థిక సహాయం అందజేయబడుతుందని వివరించారు. ఈ ప్రయోజనాలు పొందాలంటే భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలని, అర్హులైన కార్మికులు తమ దరఖాస్తులను తమ పరిధిలోని డిజిటల్ అసిస్టెంట్ లేదా వార్డు ఎడ్యుకేషన్ ఒ డెవలప్‌మెంట్ సెక్రటరీ ద్వారా ఏపీ సేవా పోర్టల్ లో నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే, ఇంకా నమోదు చేయించుకోని కార్మికులు తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్ భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో లబ్ధిదారులుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పథకాల ద్వారా కార్మికుల జీవనోపాధి భద్రత మరింత బలోపేతం అవుతుందని ఆమె పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని అర్హులైన కార్మికులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందాలని జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి ఆకాంక్షించారు.

# "నీట్ "పరీక్ష ను ప్రశాంత వాతావరణం లో కట్టుదిట్టంగా నిర్వహించాలి

### మే 3 ఆదివారం రోజున నీట్ పరీక్ష

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి




కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 29: మే నెల 3వ తారీకున " నీట్ " పరీక్ష ప్రశాంత వాతావరణంలో కట్టు దిట్టంగా జరిపించాలని సమావేశంలో అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో నీట్ పరీక్ష ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో సమావేశాన్ని జిల్లా కలెక్టర్ ఏ.సిరి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... పరీక్ష వ్రాసే విద్యార్థులకు పరీక్ష హాల్ మంచి వాతావరణం తో పరిశుభ్రమైన గాలి , వెలుతురు తో ఉండాలని, శుభ్రమైన త్రాగునీరు అందుబాటులో ఉండాలని , పనికిరాని వస్తువులు , చెత్త లేకుండా పరీక్ష హాల్ పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. నీట్ పరీక్ష మధ్యాహ్నం 2 నుండి 5 గంటల వరకు జరుగుతుందని , విద్యార్థులు అందరూ బయోమెట్రిక్ అటెండెన్స్ వేయించుకొని మరియు అన్ని తనిఖీలు చేయించుకుని మధ్యాహ్నం 1:30 గంటల లోగా పరీక్ష హాలు లోకి చేరుకోవాలని , పరీక్ష హాలులోకి ఎవరు కూడా సెల్ ఫోన్లు , ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ తీసుకొని రాకూడదని వాటిని బయటనే పెట్టి రావాలని తెలిపారు. నీట్ పరీక్ష రోజు కరెంటు సరఫరా నిరంతరాయంగా కొనసాగాలని అందుకు కావలసిన ఏర్పాట్లు చేసుకోవాలని ట్రాన్స్కో వారిని ఆదేశించారు. ఒక ఏఎన్ఎం తో ఓ ఆర్ ఎస్ , పెయిన్ కిల్లర్స్, ఫస్ట్ ఎయిడ్ కిట్ మొదలగు మందులతో ప్రతి సెంటర్ లో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని అవసరం మేరకు అంబులెన్స్ లు అందుబాటులో ఉంచుకోవాలని , నడవలేని అన్యదా సమర్థులైన విద్యార్థులకు వీల్ చైర్స్ సౌకర్యం అవసరం మేరకు కల్పించాలని డిస్ట్రిక్ట్ ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ఉమ ను ఆదేశించారు. నీట్ పరీక్ష రోజున కర్నూలు పట్టణంలో ఎక్కడ ట్రాఫిక్ కు అంతరాయం కలగకూడదని , పరీక్ష నిర్వహణకు కావలసిన బందోబస్తు కూడా ఏర్పాటు చేయాలని , అవసరమైన ప్రదేశాలలో దుకాణాలు మూయించాలని పోలీస్ వారిని ఆదేశించారు. 4,928 మంది విద్యార్థులు 16 కేంద్రాలలో పరీక్ష రాస్తూ ఉన్నందున వారి అవసరం మేరకు అన్ని పరీక్షా కేంద్రాలకు ఉదయం 11-30 గంటల నుండి కర్నూలు ఆర్టీసీ బస్టాండ్ నుండి " నీట్ పరీక్ష స్పెషల్ " బస్సు గా పేరు పెట్టి బస్సులు నడపాలని ఆర్టీసీ ఆర్.ఎం శ్రీనివాసులు ను ఆదేశించారు. ఈ సమావేశానికి డిఆర్ఓ చిరంజీవి , నీట్ పరీక్ష కోఆర్డినేటర్ లు పాయల్ ప్రియదర్శిని (ప్రిన్సిపాల్ కె.వి ) ,డాక్టర్ కే సత్యబాబు (ప్రొఫెసర్ ట్రిపుల్ ఐటి డిఎం ), ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు , ఎండోమెంట్ ఏసి సుధాకర్ రెడ్డి , ఏడి హ్యాండ్లూమ్స్ నాగరాజారావు , ఏడి డిజేబుల్ ఫాతిమారయిస్ , డి ఐ ఓ డాక్టర్ ఉమ , డిడి ఫిషరీస్ రంగనాథ్ బాబు, లేబర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు , కర్నూలు రూరల్ తాహసిల్దార్ రమేష్ మరియు చీఫ్ సూపర్డెంట్ లు పాల్గొన్నారు.

# కారుణ్య నియామకాల కింద ఏపీఎస్ఆర్టీసీ లో 24 మందికి కండక్టర్ ఉద్యోగాలు



కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 29:- కారుణ్య నియామకాల కింద ఏపీఎస్ఆర్టీసీ లో 24 మందికి కండక్టర్ ఉద్యోగాలు ఇస్తూ జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందచేశారు.. బుధవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు కలెక్టర్ నియామక ఉత్తర్వులను అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అభ్యర్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు..ఇది మంచి అవకాశం అని, ఉద్యోగాలు పొందిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ సూచించారు. ఉద్యోగాలు పొందిన వారంతా పదోన్నతులు పొంది ఎదిగే అవకాశం ఉందని, ఇప్పటినుంచే అన్ని అంశాలను నేర్చుకుని, కెరీర్ ను డెవలప్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.. జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ, చొరవ చూపడం వల్ల తమకు ఉద్యోగ నియామకం జరిగిందని అభ్యర్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు.. కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎమ్ శ్రీనివాసులు, ఉమ్మడి జిల్లాల ఏపీఎస్ఆర్టీసీ పిఓ రామకృష్ణ, అభ్యర్థులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్ త్రైమాసిక తనిఖీ


## జిల్లా కలెక్టర్ - జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్



చిత్తూరు, మహి న్యూస్, ఏప్రిల్ 29 : జిల్లాకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్ వద్ద పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు ఉండాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి శ్రీ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం చిత్తూరు కలెక్టరేట్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు త్రైమాసిక తనిఖీ భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎం యంత్రాలు, బ్యాలెట్ యూనిట్లు (బీయు), కంట్రోల్ యూనిట్లు (సీయు), వివిప్యాట్ (వీవీపాట్) యంత్రాలు, భద్రతా ప్రమాణాలు మరియు సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. గోడౌన్ వద్ద 24ఐ7 నిఘా నిరంతరం కొనసాగాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులుగా బహుజన సమాజ పార్టీ- బి లోకనాథం టి.డి.పి -- సురేంద్ర కుమార్, బి.జె.పి -- అట్లూరి శ్రీనివాసులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ -- ఉదయం కుమార్ రెడ్డి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ -- పరదేశి, సి.పి.యం -- గంగరాజు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రాజేంద్ర, అలాగే ఎన్నికల విభాగ సిబ్బంది మనోజ్ కుమార్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

# భారత ఎన్నికల సంఘం ఆదేశాలతో వేగవంతంగా క్లెయిమ్ ల పరిష్కారం

చిత్తూరు, మహి న్యూస్, ఏప్రిల్ 29: బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలోజిల్లాలో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఎన్నికల సంబంధించిన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ ద్వారా బోగస్, మరణించిన వారిని జాబితా నుండి తొలగించి పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించ వచ్చునని తెలిపారు. జిల్లాలో 1776 పోలింగ్ స్టేషన్ ల పరిధిలో బి ఎల్ ఓ లకు ఈ ప్రక్రియ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం దశలవారీగా నిర్వహించుచున్నామని తెలిపారు రాజకీయ పార్టీ ప్రతినిధులు తమ బిఎల్ఏ ద్వారా పరిశీలించ వచ్చునని తెలిపారు. దీనితో పాటు రాజకీయ పార్టీ ప్రతినిధులు తమ దృష్టికి వచ్చిన బోగస్, మరణించిన వారి వివరాలను బిఎల్ఓ లకు తెలిపి ఓటరు జాబితా నుండి తొలగించే కార్యక్రమానికి సహకరించాలని కోరారు. సంబంధిత బిఎల్వోలు 80% మ్యాపింగ్ చేయడం జరిగిందని తెలిపారు ఈ తేదీ నాటికి జిల్లాలో 7 నియోజకవర్గంలో కలిపి 15,79,996 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 18 సం. ల వయసు పూర్తి చేసి నూతనంగా ఓటరు గా నమోదు చేసే ప్రక్రియ సంతృప్తికరంగా కొనసాగుతున్నదన్నారు జిల్లాలో 7 రోజుల కంటే ఎక్కువ కాలంగా



పెండింగ్‌లో ఉన్న ఫార్మ్స్ చాలా తక్కువగా ఉన్నాయని, రోజూ6 వచ్చే కొత్త దరఖాస్తులను అదే రోజున ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్వో) లాగిన్‌కు పంపిస్తున్నట్లు వెల్లడించారు.

నగరి: 39 ఫార్మ్స్ పెండింగ్‌లో ఉన్నాయి. కొత్త సిబ్బంది నియామకానికి అనుమతి కోరుతూ సీఈఓ కార్యాలయానికి ప్రతిపాదనలు పంపించారు. అనుమతి వచ్చిన వెంటనే పరిష్కరిస్తారు.

కేవలం 32 ఫార్మ్స్ మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. అధికారులు ప్రతిరోజూ పరిస్థితిని సమీక్షిస్తూ రాష్ట్ర స్థాయిలో ముందంజలో ఉన్నామని తెలిపారు. ఓటర్ల జాబితాలో అనవసర తొలగింపులు జరగకుండా చూడడం, మొత్తం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం ప్రధాన ఉద్దేశ్యంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులుగా టి.డి.పి -- సురేంద్ర కుమార్, బి.జె.పి -- అట్లూరి శ్రీనివాసులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ -- ఉదయం కుమార్ రెడ్డి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ -- పరదేశి, సి.పి.యం -- గంగరాజు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రాజేంద్ర, అలాగే ఎన్నికల విభాగ సిబ్బంది మనోజ్ కుమార్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు. రాజకీయ పార్టీ ఇన్చార్జిలు మరియు ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థతో గత ప్రభుత్వం వ్యాపారం చేసింది

- చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

**మంచి విద్యతో పిల్లలకు ఉజ్వల భవిష్యత్తును అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం**



చంద్రగిరి,మహి న్యూస్,ఏప్రిల్ 29: గత వైసిపి ప్రభుత్వ నాయకులు విద్యావ్యవస్థను కూడా వ్యాపార రంగంగా మార్చుకున్నారని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని విమర్శించారు. పాకాల పట్టణంలో నిర్వహించిన బడి పిలుస్తుంది కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బస్టాండు కూడలిలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కూటమి నాయకులతో కలిసి మానవహారం నిర్వహించారు. అనంతరం బడి పిలుస్తోంది ఇంటింటి ప్రచార రథాన్ని ప్రారంభించారు.

### సంక్షేమ పథకాలే విద్యార్థులకు బాసట

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం తోడ్పాటు నిస్తుందని, ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారికి చేదోడు వాదోడుగా నిలుస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహాయ సహకారాలతో విద్యా వ్యవస్థను మరింత మెరుగు పరుస్తున్నామని పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అధిక శాతం ఉత్తమ ఫలితాలు రావడం ప్రభుత్వ కృషికే నిదర్శనమని చెప్పారు.

### విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

ప్రతి ఒక్కరికీ ఉత్తమమైన విద్యను అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అందుకు తగ్గట్టుగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యావ్యవస్థలో సమూల మార్పులు చేశారని ఎమ్మెల్యే కొనియాడారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్స్ తో పాటు తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనం వంటి పథకాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తాయన్నారు. బస్టాండ్ కూడలి నుండి చిత్తూరు రోడ్డు మలుపు వరకు నిర్వహించిన ర్యాలీలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు కూటమి నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పారిశ్రామికవేత్తల నుంచి అందిన ధరఖాస్తులకు పారదర్శకంగా త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలి

## జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు, మహి న్యూస్, ఏప్రిల్ 29: జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి అందిన ధరఖాస్తులకు పారదర్శకంగా త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలి అనిజిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ(డీఐఈపీసీ) సమావేశం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఏక గవాక్ష విధానం క్రింద గడచిన త్రైమాసిక కాలంలో అందిన ధరఖాస్తుల పరిష్కారం, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహనికి వివిధ రాయితీల మంజూరు వంటి అంశాలపై జిల్లా కలెక్టర్.. పరిశ్రమలు, ఫ్యాక్టరీస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, గ్రౌండ్ వాటర్, సాంఘిక సంక్షేమం, అగ్నిమాపక, ఏపీఐఐసీ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాల మంజూరుజిల్లా స్థాయి ప్రీ-స్క్రూటిని కమిటీ (ఎస్పీసీ) ఆన్‌లైన్ ద్వారా అందిన క్లెయిమ్‌లను పరిశీలించి, మొత్తం 22 క్లెయిమ్‌లను మంజూరు చేయడం జరిగిందని, 2 క్లెయిమ్‌లను తిరస్కరించడం జరిగిందని తెలిపారు.

### ప్రోత్సాహకాల మంజూరు క్లెయిమ్‌ల రకాలు (మొత్తం: 22)

ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ -- 2 క్లెయిమ్‌లు -- రూ. 33,23,443
పవర్ కాస్ట్ రీయింబర్స్‌మెంట్ -- 16 క్లెయిమ్‌లు -- రూ. 31,83,368
వడ్డీ సబ్సిడీ -- 4 క్లెయిమ్‌లు -- రూ. 2,07,826
మొత్తం: 22 క్లెయిమ్‌లు -- రూ. 67,14,637
సామాజిక వర్గాల వారీగా ప్రోత్సాహకాల మంజూరు సారాంశం
జనరల్ -- 19 క్లెయిమ్‌లు (86.38%) -- రూ. 30,18,601 (44.95%)
ఓబీసీ -- 1 క్లెయిమ్ (4.54%) -- రూ. 3,72,593 (5.54%)
ఎస్సీ -- 1 క్లెయిమ్ (4.54%) -- రూ. 14,64,943 (21.84%)
ఎస్టీ -- 1 క్లెయిమ్ (4.54%) -- రూ. 18,58,500 (27.67%)
మొత్తం: 22 క్లెయిమ్‌లు -- రూ. 67,14,637 (100%)
తిరస్కరించిన క్లెయిమ్‌లు (మొత్తం: 2)

గంద్రాజుపల్లి పారిశ్రామిక పార్క్ (ఐపీ), గండజుపల్లి, గంగావరం మండలంలో ఐఏఎల్ఏ ఏర్పాటు, అలాగే గంద్రాజుపల్లి ఐపీ లో లైటింగ్ సమస్యలు, మరియు జి.డి. నెల్లూరు , పలు విద్యుత్ సమస్యలు ఉన్నాయని వాటిని ఎస్పీడీసీఎల్ ఎస్సీ ఈ క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎమ్ఈ, పీఎం ఎవ్వై పథకాలపై సమీక్షించారు, మహిళలు, యువత, చిన్న వ్యాపారస్తులకి, వ్యాపార మార్గంలో తొలిసారి ప్రయత్నించే వారికి ఎక్కువ అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సూరిబాబు, జెడ్ ఎం సుబ్బారావు, ఎల్ డి ఎం హరీష్, స్కిల్ డెవలప్మెంట్ అధికారి గుణ భూషణ్ రెడ్డి, డిఆర్డిఏ పిడి శ్రీదేవి, గ్రౌండ్ వాటర్ అధికారి గోవర్ధన్ రెడ్డి, డిస్టిక్ ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్రం లో మే నెల 3 న నీట్ - 2026 పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

చిత్తూరు, మహి న్యూస్, ఏప్రిల్ 29 : మే నెల 3న చిత్తూరు పట్టణం లో జరగనున్న నీట్ -- 2026 ప్రవేశ పరీక్షలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని డిఆర్ఓ కే మోహన్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని డిఆర్ఓ సమావేశ మందిరంలో మే నెల మూడో తేదీన జిల్లాలో నిర్వహించే నీట్ -- 2026 ప్రవేశ పరీక్షల ముందస్తు ఏర్పాట్లు భాగంగా డిఆర్ఓ కె. మోహన్ కుమార్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ యం బి బి ఎస్, బిడిఎస్, బిఏఎంఎస్, బిహెచ్ఎంఎస్ వంటి మెడికల్ గ్రాడ్యుయేషన్ కోర్సులలో ప్రవేశాల కొరకు ఎన్టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) నిర్వహిస్తున్న నీట్(నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) పరీక్షలు చిత్తూరు జిల్లా కేంద్రంలోని పివికేయన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు (456 మంది) మరియు సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల(220మంది) లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు(384) మంది పరీక్షలు రాయనున్నారు మొత్తం 1060 పరీక్షకు హాజరుకానున్నారు మే 3న ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షల నిర్వహణను సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని పరీక్షలు నిర్వహించి కేంద్రాల ప్రిన్సిపాల్స్ ను ఆదేశించారు. ఎలాంటి చిన్న పొరపాట్లు కు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్షా సమయంలో విద్యుత్ అంతరాయం కలుగకుండా జనరేటర్లు ఏర్పాటు చేసుకోవాలని, పరీక్షా కేంద్రాల వెలుపల విద్యార్థుల తల్లిదండ్రులు వేచి ఉండడానికి షామియానా, త్రాగునీరు ఏర్పాటు చేయాలని,పరీక్ష కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, విభిన్న ప్రతిభావంతులకు వీల్ చైర్ లు అందుబాటులో ఉంచాలని, పరీక్షా లేంద్రలలోకి ఇన్విజిలేటర్లు, విద్యార్థులు ఎవ్వరు కూడా సెల్ ఫోన్ లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతి లేదని,. సెల్ ఫోన్ లను భద్రపరుచుటకు ప్రత్యేక కౌంటీర్ ఏర్పాట్లు చేయాలని, ప్రతి పరీక్షా కేంద్రం లో రెవెన్యూ మరియు, పోలీస్ శాఖల తరఫున నియమించిన నోడల్ అధికారులు ఉంటారని,, పరీక్షా కేంద్రాలలో సిటింగ్ అర్జెమెంట్, లైట్ లు, ఫ్యాన్ లు వంటి ఏర్పాట్లు పూర్తి చేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీసు, విద్యుత్తు, విద్యాశాఖ, జిల్లా వైద్యశాఖ, పోస్టల్, నోడల్ ఆఫీసర్ జీవనజ్యోతి, ఎమ్మార్వో, వివిధ కళాశాల ప్రిన్సిపాల్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విజయగాధ - జలధార

చిత్తూరు, మహి న్యూస్, ఏప్రిల్ 29 : వర్షపు నీటిని వృధా కాకుండా నిల్వ చేసి, గ్రామీణ ప్రాంతాల్లో సాగునీటి భద్రతను పెంపొందించాలని మహోన్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జలధార జలహారతి 100 రోజుల కార్యాచరణ పథకం చిత్తూరు జిల్లాకు జీవం పోస్తోంది. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు.. డ్వామా, ఇరిగేషన్ శాఖల సమన్వయంతో చేపట్టిన పూడికతీత పనులు, కాలువల పునరుద్ధరణ, చెరువుల శుభ్రత తదితర నీటి ప్రవాహ మార్గాల పునరుద్ధరణతో ప్రతి చెరువుకు నీరు చేరేలా చేపట్టిన కార్యక్రమాలు నీటి వనరులకు జీవం పోస్తున్నాయి. ఈ పనుల వల్ల సాగునీటి లభ్యత పెరిగి రైతుల జీవనోపాధికి కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

విస్తృత స్థాయిలో నీటి సంరక్షణ పనులు

100 రోజుల ప్రణాళికలో చెరువులు, ఫీడర్ కాలువల పునరుద్ధరణ పనులు వేగవంతం

తవణంపల్లి మండలం, టీ .పుత్తూరు మండలంలో జరుగుతున్న పనులను

జిల్లా జల వనరుల శాఖ పీడీ రవికుమార్ పరిశీలించారు

భూగర్భ జలాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా జలధార--జలహారతి పథకానికి శ్రీకారం చుట్టిందని

జిల్లా జల వనరుల శాఖ పీడీ రవికుమార్ తెలిపారు.

వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా చెరువులు, సప్లై ఛానళ్లు (ఫీడర్ కాలువలు) పునరుద్ధరణ పనులను ఉపాధి హామీ పథకం నిధులతో కూలీల ఆధ్వర్యంలో చేపట్టి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సప్లై ఛానళ్ల పునరుద్ధరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. తొలి విడతగా 1,024 పనుల నిర్వహణకు జిల్లా కలెక్టర్ ఆమోదం తెలిపారని వెల్లడించారు. ప్రస్తుతం చెరువుల్లో పూడిక తొలగింపు, సప్లై ఛానళ్లలో పెరిగిన మొక్కల తొలగింపుకు అనుకూల సమయమని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 6 నుంచి ప్రారంభమైన జలధార--జలహారతి కార్యక్రమం 100 రోజుల పాటు కొనసాగుతుందని, జూలై 14 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రభుత్వ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు, సభ్యులు, గ్రామ ప్రజలు సమిష్టిగా పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. గత వర్షాకాలంలో పూర్తిగా నిండని చెరువులను గుర్తించి, వాటికి నీరు చేరకపోవడానికి గల కారణాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. నీటి వనరుల నుంచి చెరువుల వరకు



ఉన్న ఫీడర్ కాలువల్లో అడ్డంకులను తొలగించడం, చెరువుల్లో పేరుకుపోయిన పూడికను తొలగించడం, చెరువు బండలను మరమ్మతు చేయడం, అదనపు నీరు వృథా కాకుండా మరో చెరువుకు మళ్లించే చర్యలు చేపడుతున్నామని వివరించారు. గతంలో 50 శాతం కంటే తక్కువగా నిండిన చెరువులను గుర్తించి, ఉపాధి హామీ సిబ్బంది, ఇరిగేషన్ ఇంజినీర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు సంయుక్తంగా పరిశీలించి సమస్యలను గుర్తిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు సుమారు 1,500 చెరువులను పరిశీలించి, సమస్యలను విశ్లేషించగా, దాదాపు 600 పనులు ఇప్పటికే ప్రారంభించినట్లు వెల్లడించారు. ఉపాధి హామీ నిధులతో సాధ్యంకాని పనులను జిల్లా కలెక్టర్ నిధులతో చేపడుతున్నామని తెలిపారు. చెరువుల పునరుద్ధరణ, ఫీడర్ కాలువల మరమ్మతులు, వ్యవసాయానికి నీటి సరఫరా మెరుగుదల ద్వారా నీటి భద్రతను పెంచడంతో పాటు భూగర్భ జలాల మట్టాన్ని పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని చెప్పారు. అదేవిధంగా స్టాగర్డ్ ట్రెంచ్‌లు, సీసీటీ పనులు, మొక్కల పెంపకం కార్యక్రమాలు కూడా చేపడుతున్నామని తెలిపారు. వర్షపు నీరు భూమిలో ఇంకి, చెరువుల్లో నిల్వ ఉండి వ్యవసాయానికి ఉపయోగపడేలా చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. గౌరవ ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు ఈ 100 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ సమిష్టిగా కృషి చేస్తున్నారని రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా టీ.పుత్తూరు చెరువుకు సంబంధించిన ఫీడర్ కాలువ పనులను అధికారులతో కలిసి పరిశీలించి, కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, రైతులు ఈ కార్యక్రమంలో భాగస్వాములై పనుల వేగవంతానికి సహకరించాలని ఆయన కోరారు.

### ఉపాధి ఆదాయం కల్పిస్తున్న - జలధార పనులు

టి .పుత్తూరు గ్రామానికి చెందిన వెంకటరమణ మాట్లాడుతూ.. ఉపాధి హామీ క్రింద చేపడుతున్న జలధార జలహారతి పనులు మాకెంతో ఉపయోగపడుతున్నాయి. ఈ పనుల ద్వారా ఆదాయం కలుగుతోంది. ఈ ప్రాంతం మరియు కొండల్లో పడిన వర్షపు నీరు వృధా కాకుండా చేసేందుకు ఈ కాలువ పని చేయడం ద్వారా నీటిని చెరువులోకి వెళ్లేలా చేయడం ద్వారా చేపట్టే పనులు మాకెంతో ఉపయోగపడటమే కాకుండా మాకు జీవన భృతిని కూడా అందిస్తోంది. అలాగే మా పైర్లు పండడానికి మరియు మాకు సాగు త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉంటాయి. జలధార కార్యక్రమాన్ని చేపట్టిన ప్రభుత్వానికి, కలెక్టర్ కు మా కృతజ్ఞతలు.

### టీ .పుత్తూరు గ్రామానికి చెందిన వరలక్ష్మి మాట్లాడుతూ..

గతంలో 100 రోజులు ఉన్న ఉపాధి హామీ పనులు నేడు 125 రోజులకు ప్రభుత్వం పెంచిందన్నారు. ఈ పనుల వలన ఉపాధి కోసం వలసలు వెళ్ళకుండా మా గ్రామం లోనే పనులు దొరకడం తో పాటు రోజుకు రూ.305/- లు వేతనంగా పొందడం మాకెంతో సంతోషాన్నిచ్చిందన్నారు.

# వేడుకగా బొమ్మాయిపల్లి గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 43వ వార్షికోత్సవ వేడుకలు






చిత్తూరు జిల్లా/ బంగారుపాలెం ఏప్రిల్ 29.: చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజక వర్గం బంగారుపాళ్యం మండలం బొమ్మాయిపల్లి గ్రామంలో వెలసిన శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం 43వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా బుధవారం నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, రక్షాబంధనం,స్వామి వారికి అభిషేఖాలు,పూజలు,హోమ యజ్ఞాలు నిర్వహించారు.అనంతరం వేద పండితుల వేద మంత్రాలు నడుమ మంగళ హారతి ఇచ్చారు.తీర్థప్రసాదాలు అందించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ధర్మకర్తలు శారదమ్మడమల్లయ్య,క నకమ్మ గోవిందయ్య,ముఖ్య కార్య నిర్వాహకులు కె.పట్టాభి,కె.మునస్వామి, కె.నారాయణస్వామి ,కె.రవి, కె.రమేష్,కార్యనిర్వాహకులు శ్రీగౌరి యూత్,శ్రీరామ యువసేన,గ్రామస్తులు పాల్గొన్నారు.

# మే 1 నుండి 31 వరకు జనన గణన..

## ఇంచార్జి కమిషనర్ శారదా దేవి..



తిరుపతి ,మహి న్యూస్,ఏప్రిల్ 29: మే 1 వ తేదీ 31 వ తేదీ వరకు ఇంటింటి వద్ద జనన గణన ను నిర్వహించనున్నామని నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి తెలిపారు. గంగ జాతర నిర్వహణ ఏర్పాట్లు, వేసవిలో త్రాగునీటి లభ్యత, జనన గణన తదితర అంశాలపై ఇంచార్జి కమిషనర్ మీడియా సమావేశం నిర్వహించారు. గంగ జాతరను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు నగరపాలక సంస్థ నుండి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పారిశుధ్యం మెరుగ్గా చేపట్టేందుకు మూడు షిఫ్టులలో సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 24 గంటలు భక్తులకు త్రాగునీరు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నామని, భక్తులు పొంగళ్లు పెట్టుకునేందుకు కూరగాయల మార్కెట్లు అన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వేసవిలో ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వర్షాలు వచ్చే వరకు నీరు తగినన్ని అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వేడి నుండి ఉపశమనం కోసం రెండు మూడు రోజుల్లో కూడళ్ళలో షేడ్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపాటు. నీరు కలుషితం కాకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని, ప్రతి రోజూ నీటి సాంద్రత పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. ఫుట్ పాత్ ల ఆక్రమణలు ఎక్కువయ్యాయనే పిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. వాటిని తొలగించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ నెల 30 వరకు స్వీయ గణన నిర్వహించామని, మే 1 వ తేదీ నుండి 31 వ తేదీ వరకు జనన గనణ నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి ఇంటికి ఎన్యుమరేటర్లు వచ్చి వివరాలు సేకరిస్థారని తెలిపారు. అప్పుడు మీ సమాచారాన్ని అందించి సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# రోగుల వ్యక్తిగత వివరాలను డిజిటల్ గా నిర్వహించేలా డిజి నెర్వ్ కేంద్రం

## జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



చిత్తూరు, మహి న్యూస్, ఏప్రిల్ 29: రోగుల వైద్య రికార్డులను అస్పత్రులు, ప్రాథమిక వైద్యా ఆరోగ్య కేంద్రాలతో అనుసంధానం చేసే తొలి డిజిటల్ నెర్వ్ సెంటర్ కుప్పంలో మంచి ఫలితాలు సాధించుచున్నది జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు, బుధవారంస్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో, టాటా డిజిటల్ నేర్వ సెంటర్ ద్వారా సంజీవని అమలపై 27జిల్లాల వైద్య సిబ్బందికి, ఈరోజు వర్క్ షాప్ ముగింపు సమావేశం జరిగింది ఈనెల 24 తేదీన ప్రారంభమై ఈరోజు ముగింపు వర్క్ షాప్ జరిగింది ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కుప్పంలో సంజీవని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి మంచి ఫలితాలు సాధించుచున్నది ఈ డిజిటల్ నెర్వ్ సెంటర్ ద్వారా రోగుల వైద్య రికార్డులను ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో అనుసంధానించారు.ఈ ప్రాజెక్ట్ ద్వారా సృష్టించబడిన లాంగిట్యూడినల్ డేటా విశ్లేషణ ఒక ముఖ్యమైన హైలైట్‌గా ఉంటుందని, ఎందుకంటే అన్ని సేవలను ఒకే ప్లాట్‌ఫారమ్ పై పొందుపరచవచ్చని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ నిపుణులను ప్రోత్సహించడం ఈ కార్యక్రమానికి ఒక కీలకమైన అంశమని పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఆరోగ్య సంరక్షణప్రదాతలతోసంప్రదింపులు జరపాలని సూచించారు. ఈ కార్యక్రమంలోడిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ శశి భూషణ్ , టాటా ఎమ్‌డి బృందం నుండి డాక్టర్ శ్రీకాంత్ కలస్కర్ మరియు శ్రీతపన్ దాస్, సంజీవని-టాటా డిఐఎన్‌సి మోడల్ మరియు దాని భావనల రూపకల్పన పై ఒక ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 27 జిల్లాల జిల్లా కార్యక్రమ నిర్వహణ అధికారులు (డీపీఎంఓలు), జిల్లా కార్యక్రమ అధికారులు (డీపీఓలు) మరియు వైద్య అధికారుల (ఎమ్వోలు) పాల్గొన్నారు.

# అణగారిన వర్గాలకు అండగా టిడిపి

## తెలుగుదేశం పార్టీ,శ్రీకాళహస్తి నియోజకవర్గం



శ్రీకాళహస్తి. మహి న్యూస్ ఏప్రిల్ 29: పేద ప్రజల సంక్షేమం మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధే అజెండాగా పనిచేసే తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అణగారిన వర్గాలకు అండగా నిలబడుతుందని శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కొనియాడారు. బుధవారం మంగళగిరి లోని కేంద్ర కార్యాలయంలో జరిగిన తెలుగుదేశం పార్టీ జాతీయ మరియు రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేసిన శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ని రాష్ట్ర కార్యదర్శులు డా.జి.దశరథాచారి మరియు యం.సుబ్బయ్య దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన తరువాతనే బడుగు బలహీన వర్గాలు రాజకీయంగా, సామాజికంగా మరియు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవకాశాలు వచ్చాయని,స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆలోచనలకు అనుగుణంగా నేడు సియం చంద్రబాబు నాయుడు,నారా లోకేష్ బాబు అటు పార్టీలో గాని, ఇటు ప్రభుత్వ నామినేటెడ్ పదవులలో గాని బిసి, యస్సీ, యస్టీ మరియు మైనారిటీ వర్గాల లోని సమర్థులైన వారికి నియామక అవకాశాలు కల్పిస్తున్నారని కొనియాడారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా ఈరోజు ప్రమాణస్వీకారం చేయబోతున్న శ్రీకాళహస్తి నియోజకవర్గ నాయకులు డా.జి.దశరథాచారి,యం.సుబ్బయ్యకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరథాచారి,వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు,రాష్ట్ర కార్యదర్శి యం.సుబ్బయ్య, శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు,బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు,శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్,కాపునాడు నాయకుడు తొగురు హరి తదితరులు పాల్గొన్నారు.

# బాబూ! టిఫిన్ బాగుందా?



కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 29 : బాబూ.. టిఫిన్ బాగుందా? రోజు ఇక్కడే టిఫిన్ చేస్తావా? సిబ్బంది ఎలా వ్యవహరిస్తారు? అంటూ నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్న క్యాంటీన్లో స్థానికులతో అప్యాయంగా మాట్లాడారు. బుధవారం ఉదయం కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న అన్న క్యాంటీన్, ముజఫర్ నగర్ రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. పారిశుద్ధ్య తనిఖీల అనంతరం ముజఫర్ నగర్ రోడ్డులోని అన్న క్యాంటీన్లో ఆయన అల్పాహారం చేశారు. ఆయనతో పాటు ఆయన సిబ్బంది, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘుతో సైతం అల్పాహారం చేయించి రుచిపై ఆరా తీశారు. స్వయంగా టోకెన్ తీసుకుని, అల్పాహారం చేస్తున్న వారితో మాట్లాడుకుంటూ అల్పాహారం చేశారు. అన్న క్యాంటీన్ల పరిసరాల్లో తిరిగారు. తాగునీటిని శుభ్రమైన ప్రదేశాల్లో ఉంచాలని, డస్ట్‌బిన్‌లను ప్రతిరోజు శుభ్రం చేయాలని సూచించారు. అన్న క్యాంటీన్లలో భోజనం చేసే ప్రతి ఒక్కరూ సంతృప్తి చెందేలా, నాణ్యత, పారిశుద్ధ్య ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, శానిటేషన్ ఇంస్పెక్టర్లు రమేష్, లోకేష్, ఎంజల్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.



# రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టండి



కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 29: రి సర్వే ప్రక్రియ పనులు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు. బుదవారం దేవనకొండ మండలం పెద్దపల్లి గ్రామంలో 5వ దశలో జరుగుచున్న రీ సర్వే ప్రక్రియ పనులు ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... సర్వే ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనల ప్రకారం జరుగుతోందో లేదో ప్రత్యక్షంగా రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. సర్వే ప్రారంభానికి ముందు నోటీసులు అందించారా? సర్వే విధానం, వివరాలు మీకు పూర్తిగా తెలియజేశారా? అనే అంశాలపై రైతులను ప్రశ్నించారు. దీనికి స్పందించిన రైతులు సానుకూలంగా స్పందిస్తూ, ముందస్తు సమాచారం అందించడంతో పాటు సర్వే ప్రక్రియ స్పష్టంగా వివరించబడిందని తెలిపారు. అధికారులు ఇదే విధంగా పారదర్శకతను కొనసాగిస్తూ రైతుల విశ్వాసాన్ని పెంపొందించాలన్నారు. ప్రతి భూ యజమానికి సర్వేకు ముందుగా నోటీసులు జారీ చేయడం తప్పనిసరి అని అన్నారు. రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలన్నారు. సర్వే సమయంలో భూసరిహద్దులు, రికార్డులు, ఫీల్డ్ మేజర్‌మెంట్ బుక్స్ తదితర వివరాలను సమగ్రంగా పరిశీలించి ఖచ్చితమైన రికార్డులను నమోదు చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ఎటువంటి నిర్లక్ష్యం, ఉండకూడదని హెచ్చరించారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ రీ సర్వే కార్యక్రమం ద్వారా భూములపై స్పష్టమైన హక్కులు స్థిరపడటంతో పాటు భవిష్యత్తులో భూ వివాదాలు తగ్గుతాయని తెలిపారు. ఆధునిక సాంకేతిక పద్ధతులను ఉపయోగించి ఖచ్చితమైన సర్వే నిర్వహించడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు.

# ఈవిఎం ల భద్రతకు సంబంధించి ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదు

## జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి




కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 29:- ఈవిఎం ల భద్రతకు సంబంధించి ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ కాంప్లెక్స్ లో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ లను భద్రపరచిన గోడౌన్ ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ లను భద్రపరచిన గోడౌన్ ను పరిశీలిస్తూ ఈవిఎం ల భద్రతకు సంబంధించి ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. ఈవిఎం లకు సంబంధించిన భద్రత ఏర్పాట్లు, సీసీ టీవీ పర్యవేక్షణ, ఎంట్రీ ఎగ్జిట్ రిజిస్టర్ నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించి కలెక్టర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.. కార్యక్రమంలో ఇంచార్జి డిఆర్ఓ చిరంజీవి, ఎన్నికల విభాగం సూపరిశీటెండెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వే ప్రక్రియ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

## నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి

## జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్



కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 29: రైతులు భాగస్వామ్యంతో రి సర్వే ప్రక్రియ కొనసాగిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు. బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదోని డివిజన్లోని మండలాలలో నిర్వహించిన రీ సర్వే, పి జి ఆర్ ఎస్, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్, రెవెన్యూ సంబంధించిన రెవెన్యూ అంశాలపై జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆదోని డివిజన్‌లో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను సమయపాలనతో, నాణ్యతతో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... రీ సర్వే పనుల పురోగతిని సమీక్షించి, ప్రతి దశలో ఉన్న పనులను వేగవంతం చేయాలని సూచించారు. మొదటి దశలో డివిజన్‌లోని 9 మండలాల్లో 9 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించి, 13 నోటిఫికేషన్ స్థాయిని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. రెండవ దశలో చేపట్టిన మరో 9 గ్రామాల్లో కూడా 13 నోటిఫికేషన్ పూర్తి చేసి, తుది దశలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ రెండు దశలకు సంబంధించిన మిగిలిన పనులను తక్షణమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మూడవ దశలో చేపట్టిన 16 గ్రామాల్లో రీ సర్వే పనులు ప్రస్తుతం వీఆర్వో మరియు విలేజ్ సర్వేయర్ స్థాయిలో డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్ దశలో ఉన్నాయని తెలిపారు. ఈ పనులను మే 3వ తేదీలోగా పూర్తి చేయాలని స్పష్టమైన గడువు విధించారు. నాలుగవ దశలో 17 గ్రామాల్లో రీ సర్వే పూర్తయ్యి, ప్రస్తుతం వీఆర్వో మరియు విలేజ్ సర్వేయర్ లాగిన్ దశలో ఉన్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేసి తదుపరి దశలకు తీసుకెళ్లాలని సూచించారు. ఐదవ దశలో 15 గ్రామాల్లో రీ సర్వే నిర్వహణ పూర్తయ్యి, ప్రస్తుతం గ్రౌండ్ ట్రూతింగ్ దశలో ఉన్నట్లు తెలిపారు. ఈ దశలో రైతుల భాగస్వామ్యాన్ని పెంచి, పారదర్శకంగా రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా వివిధ దశల్లో ఉన్న డ్రాఫ్ట్ పట్టాదారు పాసుపుస్తకాలను 100 శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మే మరియు జూన్ నెలల నాటికి సంబంధిత రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందే విధంగా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మార్చి 2027 నాటికి రీ సర్వే ప్రక్రియను పూర్తిచేసి, ప్రతి అర్హ రైతుకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించాలనే దిశగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ఇంకా ఎఫ్-లైన్, మ్యుటేషన్, ఆర్.ఓ.ఆర్ సంబంధిత అంశాలలో ప్రజలకు సంతృప్తికరమైన సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల ఫిర్యాదులు, వినతులు నమోదు అయ్యే పి.జి.ఆర్.ఎస్ వ్యవస్థలో వచ్చిన ప్రతి అభ్యర్థనను సమగ్రంగా పరిశీలించి, తగిన విధంగా పరిష్కరించాలన్నారు. ఒకవేళ సమస్య పరిష్కరించడం సాధ్యంకాకపోతే, దానికి సంబంధించిన ఎండార్స్మెంట్‌ను స్పష్టంగా ఇవ్వాలని అధికారులకు సూచించారు. రీ సర్వే ప్రక్రియలో పారదర్శకత, వేగం, ఖచ్చితత్వం కలగలిపి రైతులకు న్యాయం జరిగేలా ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శేషఫణి, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాసరాజు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నగరంలో ఉండే ప్రధాన కూడళ్లలో సుందరీకరణ పనులు చేపట్టండి



కర్నూలు, మహి న్యూస్, ఎప్రిల్ 29 :- కర్నూలు నగరంలో ఉండే ప్రధాన కూడళ్లలో సుందరీకరణ పనులు చేపట్టాలని, నగరంలో ఉండే ప్రతి ఒక్క వీధి సుందరీకరణంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి మున్సిపల్ అధికారులను ఆదేశించారు.. బుధవారం నగరంలోని బంగారుపేట ప్రధాన కూడలిలో మెరిడియన్ వద్ద మొక్కల సుందరీకరణ, ఎన్ఆర్ పేట లో మున్సిపల్ నూతన కార్యాలయం నిర్మాణ పనులు పరిశీలన, ఉల్చాల వై జంక్షన్ లో చేపట్టనున్న అభివృద్ధి పనులను, బళ్లారి చౌరస్తా వద్ద బస్టాండ్ అనుసంధాన రోడ్డు పనులు, కిడ్స్ వరల్డ్, కేసి కెనాల్ పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బంగారు పేట ప్రధాన కూడలిలో మెరిడియన్ ను పరిశీలిస్తూ డివైడర్లలో మట్టి పైకి ఎగరకుండా గడ్డి పెంచాలన్నారు. కొత్త కొత్త మొక్కలను నాటి విధంగా చర్యలు తీసుకోవాలని అదే విధంగా డివైడర్లకు పెయింటింగ్ వేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మున్సిపల్ ఇంజినీర్ లను ఆదేశించారు. నగరంలో ఉండే ప్రతి ఒక్క వీధి సుందరీకరణంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్ఆర్ పేట వద్ద చేపడుతున్న నూతన మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు నాణ్యత పాటించాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ఉల్చాల వై జంక్షన్‌లో అభివృద్ధి పనులను త్వరగా చేపట్టాలని, అక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే షిఫ్ట్ చేయాలని కలెక్టర్ విద్యుత్ శాఖ ఎస్ఈ ను ఆదేశించారు. బళ్లారి చౌరస్తాలో బస్టాండ్‌ను అనుసంధానించే రోడ్డు పనులను పరిశీలిస్తూ ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా పనులను సమయానికి పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ రోడ్డు అభివృద్ధి ద్వారా ట్రాఫిక్ రద్దీ తగ్గి, రవాణా సౌకర్యం మెరుగుపడుతుందన్నారు. కిడ్స్ వరల్డ్ పార్క్ ను పరిశీలిస్తూ పార్క్ యొక్క నిర్వహణ బాగా చేస్తే ఎక్కువ మంది ప్రజలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. మే చివరి నాటికి కిడ్స్ వరల్డ్ నిర్వహణ మెరుగు పరచాలని కలెక్టర్ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. స్విమ్మింగ్ పూల్ లో నీరు శుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు...ఆనంద్ థియేటర్ సమీపంలో ఉన్న కెనాల్ పైభాగంలో ఆర్ట్ పెయింటింగ్ వేయాలని కలెక్టర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. నగరంలో చెత్త ఎక్కువగా పేరుకుపోయే ప్రాంతాలు అన్నింటినీ క్రమం తప్పకుండా శుభ్రం చేయాలన్నారు. కేసీ కెనాల్ లోకి చెత్త వేయకుండా ఏర్పాటు చేసిన గ్రిల్స్ కొన్ని చోట్ల పాడయ్యాయని, వాటిని వెంటనే రిపేర్ చేయించాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. నంద్యాల చెక్ పోస్ట్ వద్ద జరుగుతున్న రోడ్డు పనులకు సంబంధించి పెండింగ్ లో ఉన్న టీడీఆర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ఓపెన్ స్పేస్ లు ఉన్న ప్రదేశాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. నగర అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యంతో విజయవంతమవుతాయని, అందరూ కలిసి కర్నూలును పరిశుభ్రమైన, సుందరమైన, పచ్చని నగరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పేర్కొన్నారు . కార్యక్రమంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్ల ఓబులేష్, ఎస్ఈ రమణ మూర్తి, డిప్యూటీ ఇంజనీర్ కృష్ణ లత, సంబధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పంట మార్పిడి ద్వారా రైతుల ఆదాయం పెంపు




నంద్యాల, మహి న్యూస్, ఏప్రిల్ 29:- జిల్లాలో వ్యవసాయ రంగాన్ని లాభదాయకంగా, స్థిరంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న జోనల్ రీసెర్చ్ అండ్ ఎక్స్‌టెన్షన్ అడ్వైజరీ కౌన్సిల్ (=జూరాజ) సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సమావేశంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ వ్యవసాయ డైరెక్టర్ సిహెచ్ శ్రీనివాసరావు, విస్తరణ డైరెక్టర్ జి. శివ నారాయణ, ఆర్ఏఆర్ఎస్ రీసెర్చ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. జాన్సన్, అనంతపురం, కర్నూలు, సత్యసాయి, నంద్యాల జిల్లాల వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, జిల్లాలో సుమారు 3.35 లక్షల మంది రైతులు తమ జీవనోపాధిగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా, స్థిరంగా తీర్చిదిద్దేందుకు ఆధునిక సాగు విధానాలు, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు ఇచ్చే పంటలు, నీటి వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలపై దృష్టి సారిస్తూ సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణలు అందించి, మార్కెటింగ్ సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భూమి సంరక్షణ, తక్కువ కాలంలో అధిక దిగుబడి సాధించే పంటల ఎంపిక, తక్కువ నీరు మరియు ఎరువులతో అధిక లాభాలు అందించే విధానాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వరి, మొక్కజొన్న, మిర్చి వంటి పంటలు అధికంగా సాగు చేస్తున్నట్లు వివరించారు. రైతుల ఆదాయం పెంపుతో పాటు మార్కెటింగ్ సౌకర్యాలను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఆదాయంలో వ్యవసాయం మరియు అనుబంధ రంగాలు సుమారు 42 శాతం వాటా కలిగి ఉన్నాయని, ముఖ్యంగా హార్టికల్చర్ రంగం రైతులకు అధిక ఆదాయం అందిస్తున్నదని తెలిపారు. వ్యవసాయంలో పంట మార్పిడి అత్యవసరమని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో 82 శాతం నల్లరేగడి భూములు ఉండటంతో వరి సాగుపై ఆధారపడటం తగ్గించి, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మళ్లాలని సూచించారు. బహుళ పంటల సాగు, మిశ్రమ పద్ధతులు ప్రోత్సహించడం ద్వారా ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న 2.5 నుంచి 3 లక్షల ఎకరాల బీడు భూములను వినియోగంలోకి తీసుకువచ్చి పప్పుధాన్యాలు, చిరుధాన్యాల సాగు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. రైతుల ఆదాయంలో మండలాల వారీగా వ్యత్యాసాలు ఉన్నాయని, మహానంది, డోన్, పాణ్యం మండలాలు అగ్రస్థానంలో ఉండగా, నందికొట్కూరు, గోస్పాడు మండలాల్లో తక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ అసమానతలను తగ్గించేందుకు ప్రణాళికాబద్ధ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత వినియోగం పెంచడం అత్యంత కీలకమన్నారు. శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన సాంకేతికత రైతులకు నేరుగా చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రదర్శన ప్లాట్లు పెంచడం ద్వారా రైతుల్లో అవగాహన మరియు నమ్మకం పెంపొందించవచ్చని తెలిపారు. ఎరువుల అధిక వినియోగంపై కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లా డీఏపీ ఎరువుల వినియోగంలో ముందంజలో ఉండటం వల్ల భూసారం తగ్గిపోతుందని, రసాయనాల ప్రభావం ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. సేంద్రీయ వ్యవసాయం, సమతుల్య ఎరువుల వినియోగం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ధాన్యం విక్రయంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం అత్యవసరమని కలెక్టర్ తెలిపారు. తేమ శాతం 17 శాతం కంటే తక్కువగా ఉంచి ధాన్యాన్ని విక్రయించాలన్నారు. సరైన పద్ధతిలో ఆరబెట్టకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల సాగు మరియు సాంకేతికత వినియోగంపై దృష్టి సారించాలని సూచిస్తూ, వరదలను తట్టుకునే వంగడాలు, తక్కువ ఎత్తు మొక్కజొన్న రకాలు సాగు చేయాలని సూచించారు. మిల్లెట్స్ వినియోగాన్ని ప్రోత్సహించడం, ప్రకృతి వ్యవసాయంలో సాంకేతికత వినియోగం పెంపు ద్వారా వినియోగదారుల్లో విశ్వాసం పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పశుసంవర్ధక రంగం ద్వారా జిల్లాలో రోజుకు 11 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతోందని, సరైన మేత అందిస్తే దీనిని 22 లక్షల లీటర్లకు పెంచే అవకాశముందని తెలిపారు. శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్న కలెక్టర్, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య మరియు పశుసంవర్ధక శాఖలు కలిసి పనిచేయాలని సూచించారు. భూగర్భ జలాల పెంపు, సాగు నీటి సమర్థ వినియోగంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కూరగాయల ధరల అస్థిరత రైతులకు నష్టాన్ని కలిగిస్తున్నదని పేర్కొన్న కలెక్టర్, మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హార్టికల్చర్ పంటలు, కొత్త పంటల సాగు, ఆయిల్ పామ్ వంటి దీర్ఘకాలిక పంటల విస్తరణ ద్వారా రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని, నంద్యాల జిల్లాను వ్యవసాయంలో రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. అంతకుముందు వ్యవసాయ విశ్వవిద్యాలయ వ్యవసాయ డైరెక్టర్ సిహెచ్. శ్రీనివాసరావు, విస్తరణ డైరెక్టర్ జి. శివనారాయణ, ఆర్ఏఆర్ఎస్ రీసెర్చ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. జాన్సన్‌లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆధునిక వ్యవసాయ పద్ధతులు మరియు అనుసరించాల్సిన మెలకువలపై రైతులకు వివరించారు.

# నంద్యాల జిల్లాలో పరిశ్రమల విస్తరణకు కలెక్టర్ దిశానిర్దేశం



నంద్యాల, మహి న్యూస్, ఏప్రిల్ 29:- జిల్లాలో నూతన పరిశ్రమలను స్థాపించి నిరుద్యోగ యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో రాయలసీమ ఎకనామిక్ డెవలప్మెంట్ బోర్డు కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూమి, నీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపిస్తే మార్కెటింగ్ అవకాశాలు కూడా మెండుగా ఉన్నాయని అన్నారు. పరిశ్రమల శాఖ అధికారులు పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి నూతన పరిశ్రమల స్థాపనకు చురుకుగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్థానిక పరిస్థితులు, వనరులను దృష్టిలో ఉంచుకొని ఏ రకమైన పరిశ్రమలు స్థాపిస్తే మంచి మార్కెట్ లభిస్తుందో అధ్యయనం చేసి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. నంద్యాల జిల్లాలో పరిశ్రమల స్థాపనకు దాదాపు ఆరు లక్షల ఎకరాల భూమి అందుబాటులో ఉందని కలెక్టర్ వెల్లడించారు. ముఖ్యంగా బనగానపల్లె, డోన్, బేతంచెర్ల, ప్యాపిలి వంటి వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే అక్కడి యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని పేర్కొన్నారు. ప్రత్యేకంగా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు (అగ్రి-బేస్డ్ ఇండస్ట్రీస్) ఏర్పాటు చేయడం ద్వారా మరింత ఉపాధి సృష్టి సాధ్యమవుతుందని అన్నారు. ఫ్యాక్టరీలకు అవసరమైన విద్యుత్ సరఫరా సమృద్ధిగా అందించాలనీ, ప్రస్తుతం ఫ్యాక్టరీలకు అందిస్తున్న విద్యుత్ సామర్థ్యంపై పూర్తి వివరాలను సమర్పించాలని ఏపీఎస్పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. నిప్పాన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కన్సల్టెంట్ శేఖర్ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధికి అనుకూలమైన వనరులు విస్తృతంగా ఉన్నాయని తెలిపారు. సెమీకండక్టర్ పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు మరియు డ్రై పోర్ట్ ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఆర్ ౘ బి ఈఈ మదన్ గోపాల్, పరిశ్రమల శాఖ జీఎం మహబూబ్ బాషా, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ నాగేశ్వరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# వీఆర్ఏల ఆత్మీయ సత్కారం

## తహసీల్దార్ మధురవాణికి ఘన సన్మానం



పులివెందుల /తొండూరు మహి న్యూస్ ఏప్రిల్ 29 : మండల రెవెన్యూ వ్యవస్థలో కీలకంగా వ్యవహరిస్తున్న వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్న తహసీల్దార్ మధురవాణిని మండల వీఆర్ఏలు బుధవారం ఘనంగా సన్మానించారు. తొండూరు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని వీఆర్ఏలు అందరూ పాల్గొని తహసీల్దార్ మధురవాణికి శాలువా కప్పి,పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. “మేడం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది సమస్యలను ఓపికగా వింటున్నారు. సకాలంలో పరిష్కరిస్తున్నారు. విధి నిర్వహణలో మాకు పూర్తి సహకారం అందిస్తూ,అధికారులు-సిబ్బంది మధ్య సమన్వయంతో పనిచేయిస్తున్నారు” అని వీఆర్ఏల సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మధురవాణి మాట్లాడుతూ,“రెవెన్యూ వ్యవస్థకు వీఆర్ఏలు పునాది లాంటివారు. గ్రామస్థాయిలో ప్రభుత్వానికి,ప్రజలకు మధ్య వారధిగా ఉంటున్నారు. మీ అందరి సహకారంతోనే మండలంలో రెవెన్యూ సేవలు సజావుగా అందుతున్నాయి. ఇదే స్ఫూర్తితో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిద్దాం” అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రామకృష్ణారెడ్డి,ఆర్ఐలు,వీఆర్ఓలు,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన వైయస్ మనోహర్ రెడ్డి




పులివెందుల మహి న్యూస్ ఏప్రిల్ 29:: పట్టణంలోని కదిరి రోడ్డులో ఉన్న ఎస్సీఎస్ఆర్ కళ్యాణమండపంలో లింగాల మండలం అంబక పల్లి గ్రామానికి చెందిన క్రిష్టిపాటి చెన్నకేశవరెడ్డి, క్రిష్టిపాటి చంద్ర కళావతి ల కుమారుడు సాయినాథ్ రెడ్డి- కీర్తి రెడ్డి ల వివాహా మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ వివాహ మహోత్సవా నికి వైకాపా మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ వి సతీష్ కుమార్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైకాపా నాయకులు బలరాం రెడ్డి, సురేష్ రెడ్డి (చంటి), దశరథ రామిరెడ్డి లు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

# కార్మికుల పండుగ మేడేని జయప్రదం చేయాలి




పులివెందుల మహి న్యూస్ ఏప్రిల్ 29: పనిచేసే కార్మికులు తమ హక్కుల కోసం పోరాడి సాధించుకున్న దినం మే డే. మే డే స్ఫూర్తితో కార్మికులు భారతదేశంలో తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్స్ వ్యతిరేకిస్తూ మే డే ను జయప్రదం చేయాలని కడప జిల్లా కమిటీ సభ్యులు గఫూర్,సలీమాలు అన్నారు బుధవారం గఫూర్ డ్రైవింగ్ స్కూల్ నందు మీడియా సమావేశం నిర్వహించారు.అనంతరం వారు మాట్లాడుతూ 140సంవత్సరాల క్రితం ప్రాణాలర్పించి కార్మికులు మే డే సాధించుకున్నారని పేర్కొన్నారు.లేబర్ చట్టాలను రద్దు చేయడం దుర్మార్గమని తెలిపారు. 8గంటల పని దినాన్ని రద్దుచేసి 12గంటల పని దినాన్ని అమలు చేయడం కోసం లేబర్ కోర్సును తీసుకురావడం దారుణమని విమర్శించారు. కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.స్కీం వర్కర్ల పరిస్థితి ఆగమ్య గోచరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.మున్సిపల్,విద్యుత్,అత్యవసర విభాగాల కార్మికుల పరిస్థి తి దయనీయంగా ఉందని పేర్కొన్నారు.సిమెంట్ రంగంలో పనిచేస్తున్న కార్మికుల దుస్థితి మరింత ఘోరమని తెలిపారు.అసంఘటిత రంగ కార్మికులు ఆటో,బిల్డింగ్,తోపుడు,హమాలి,బీడీ రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు గిట్టుబాటు ధరలు లేకపోవడం,భద్రతా,రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు.పనిచేస్తే తినాలి లేకుంటే పస్తులతో ఉండాలని చెప్పారు.ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు.ఎనిమిది గంటల పని దినం వ్యతిరేకంగా తీసుకొస్తున్న లేబర్ కోర్సు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు సాధించిన స్ఫూర్తితో మే ఒకటో తేదీన మేడే దినోత్సవం ప్రతి కార్మికుడు నిర్వహించుకో వాలని కోరారు.సమావేశంలో సిఐటియు నాయకు రాలు సుధా పాల్గొన్నారు.

# రాజంపేట. లో పేద ముస్లిం బాలురకు ఉచిత ఖత్నా వడుగులు




రాజంపేట. మహి. న్యూస్. ఏప్రిల్ :29: రాజంపేట29/04/2026 ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాజంపేట వారి ఆధ్వర్యంలో పేద ముస్లిం బాలురకు ఉచిత ఒడుగులు కార్యక్రమం ఉస్మాన్ నగర్ లో నిర్వహించారు. ఉస్మాన్ నగర్ లో నివాసముండే కడప ఉస్మాన్ కుమారుడు కడప ఆతిక్ అహ్మద్ బాలుడికి ఇక్బాల్ ఒడుగులు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎస్ .జి . ఇనాయతుల్లా మరియు అధ్యక్షులు ఎస్ఎండి కరీం బాలుర కుటుంబ యజమానికి ఉచితంగా ఒడుగులు చేయించి మరియు మందులతో పాటు ఒక ఎర్ర దుప్పటి, ఐదు కేజీలు గోధుమపిండి, ఒక కేజీ చక్కెర, ఒక కేజీ ఉ ద్ది బేడలు, అర్థ కేజీ నెయ్యి, ఒక లీటరు పామాయిల్ ఉచితంగా ఇచ్చారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్ఎండి కరీం మాట్లాడుతూ దాతల సహకారంతో ఉచితవడుగుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. పేద కుటుంబాల వారు ఇబ్బంది పడకుండా వారి బిడ్డలకు ఉచిత ఒడుగులు చేస్తున్నామని ఎవరైనా ఒడుగులు చేపించుకోవాలని కోరిక ఉన్నవారు తమను సంప్రదిస్తే వారు చెప్పిన టయానికి వారు చెప్పిన డేట్ కు ఉచితంగా ఒడుగులు చేపిచ్చి వారికి ఉచితంగా వస్తువులు ఇస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మత పెద్దలు ఒడుగులు చేయించుకున్న బాలురకు శుభం కలగాలని మంచి జరగాలని ఆ కుటుంబం సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముజఫర్ అహ్మద్, మోసిన్ ఖాన్, నిస్సార్ అహ్మద్ కరీం, తదితరులు పాల్గొన్నారు





# ప్రముఖ పారిశ్రామిక వేత్త, రాజకీయ కుర వృద్ధుడు

## డాక్టర్ జి. ఎన్.నాయుడు మరణ వార్త బాధాకరం




రైల్వే కోడూరు. మహి న్యూస్. ఏప్రిల్ :29: వెనుకబడిన మా ప్రాంతంలో జి. ఎన్ నాయుడు టీ.కమ్మ పల్లి నందు పుట్టి ఇంజనీర్ గా పట్టభద్రుడై సాయి ప్రశాంత నిలయం నిర్మాణంలో పాలుపంచుకొంటున్న సందర్భంగా పుట్టపర్తి సాయిబాబా గారు పిలిచి బంగారు నువ్వు పరిశ్రమ స్థాపించామని ఆశీర్వదిస్తే, వారి సలహా మేరకు యానాం నందు రిజన్సీ సెరామిక్స్ పరిశ్రమను స్థాపించి వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు నిజాయతి, ముక్కుసూటి తనం ఆయన ఆభరణాలు, విద్యా సంస్థ లను స్థాపించి విద్యాభి వృద్ధికి తనవంతు విశేషంగా కృషి చేశారు. రాజంపేట,రాయచోటి , మదనపల్లి లో రెండు దశాబ్దాల క్రితం నీటి ఎద్దడి తీవ్రంగా ఉండటంతో సొంతంగా ట్యాంకర్ లు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని మరియు కడప జిల్లాలో పెద్దయెత్తున మెగా మెడికల్ క్యాంప్స్ ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యం కొరకు మరియు ఆలయాల జీర్ణోద్ధరణ, మరియు అన్న దానాలు చేసిన సేవాతత్పరుడిగా నిలిచారు.వారి సేవలకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అవార్డు అందుకొన్నారు .. వ్యక్తిగతంగా మా లాంటి యువత ప్రత్యేకంగా నన్ను, నా ఎదుగుదలను కోరుకొంటూ మహోన్నత వ్యక్తి వారు శివక్యం చెందడం బాధాకరం ! వారికి సద్గతులు ప్రసాదించాలని భగవంతుని ప్రార్థిస్తున్నా వారి కుటుంబానికి మనో ధైర్యం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నా ఓంశాంతి

# దివ్యంగుల సాధికారతపై.. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి..!!

**జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి రాష్ట్ర విభిన్న ప్రతిభా వంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ చైర్మన్ గుడిపూడి నారాయణ స్వామితో కలిసి దివ్యంగులకు త్రీచక్ర స్కూటర్ల పంపిణీ**

**జిల్లా వ్యాప్తంగా 70 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.70 లక్షల విలువైన మోటరైజ్డ్ త్రీచక్ర స్కూటర్లను పంపిణీ చేసిన ముఖ్య అతిథులు**





కడప, మహి న్యూస్ ఏప్రిల్ 29 : సమాజంలో దివ్యంగులు కూడా ఒక భాగమే అని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం.. దివ్యంగుల సామాజిక, ఆర్థిక అభివృద్ధి, పునరావాస సేవలతో పాటు.. సాధికారత కోసం పాటుపడుతోందని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో.. జిల్లా వ్యాప్తంగా 70 మంది దివ్యాంగులకు మంజూరైన ఉచిత మోటరైజ్డ్ స్కూటర్ల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు రాష్ట్ర విభిన్న ప్రతిభా వంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ చైర్మన్ గుడిపూడి నారాయణ స్వామి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..




రాష్ట్రంలో దివ్యంగులు.. ఏ ఒక్కరూ కూడా అసంతృప్తిగా జీవితం గడపకూడదనేదే.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశ్యం అన్నారు. అదే ఆశయంతో ముందుకు సాగుతున్న రాష్ట్ర ప్రభుత్వం వారి సరికొత్త జీవితాన్ని అందించేందుకు ముందుకు చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. దేశంలోనే మొట్టమొదటి సరిగా దివ్యంగుల సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి సారించి.. వారి కుటుంబాలకు ఆర్థిక సహకారం, ప్రత్యేక ఉపకరణాల చేయుతను అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రత్యేక అభినందనలు తెలుపుకుంటున్నామన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, కనీసం 70 శాతం దివ్యాంగత ఉన్న అర్హులైన లబ్ధిదారులకు ఈ ఉచిత మోటరైజ్డ్ వాహనాల పంపిణీ పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా స్కూటర్ల పంపిణీలో వైఎస్ఆర్ కడప జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఈ విజయం సదమైందన్నారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక ఎంపిక కమిటీ ఏర్పాటు చేసి, విస్తృత ప్రచారం ద్వారా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. మొత్తం 173 దరఖాస్తులు అందగా, వాటిని నిబంధనల ప్రకారం పరిశీలించి, 2025 డిసెంబర్ 6న నిర్వహించిన ఇంటర్వ్యూల అనంతరం అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి మొత్తం 70 మోటరైజ్డ్ స్కూటర్లు కేటాయించగా, రూ.70 లక్షల విలువైన ఈ వాహనాలను ఎంపికైన లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దేశంలోనే ఏ రాష్ట్ర ప్రభుత్వం అందించలేని నెలకు 6 వేల రూపాయల పెన్షన్, ప్రత్యేక సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమాలను కొనసాగిస్తున్న మన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. దివ్యంగుల కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వారి జీవనోపాధి కోసం ఆర్థిక ఋణాలను కూడా మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. రాష్ట్ర విభిన్న ప్రతిభా వంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ చైర్మన్ గుడిపూడి నారాయణ స్వామి మాట్లాడుతూ.. సమాజంలో దివ్యంగులకు ప్రత్యేక ప్రాధాన్యతను కల్పిస్తూ.. దివ్యంగుల అభివృద్ధి, పునరావాస సేవలతో పాటు.. సాధికారత కోసం పాటుపడుతున్న.. మొట్టమొదటి రాష్ట్ర ప్రభుత్వం మనదే అన్నారు. ఉచిత మోటరైజ్డ్ వాహనాల పంపిణీకి సంబంధించి.. అర్హత ప్రమాణాల ప్రకారం డిగ్రీ మరియు అంతకన్నా ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు, స్వయం ఉపాధి లేదా వ్యవసాయ రంగంలో పనిచేస్తున్నవారు, అలాగే కనీసం 10వ తరగతి విద్యార్హతతో ఒక సంవత్సరం ఉపాధిలో ఉన్నవారు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించబడిందన్నారు. దివ్యాంగులు మన సోదరులు అని.. వారి జీవితాలను స్వతంత్రులుగా చేయడం, వారిని గౌరవంగా ఉంచడమే ప్రభుత్వ ఉద్దేశ్యం అన్నారు. పేదలు, రైతులు, మహిళల సాధికారితతో పాటు దివ్యాంగుల సాధికారత కోసం ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. ప్రజారవాణా వ్యవస్థల్లో దివ్యంగులకు ఉచిత రవాణా సౌకర్యాలు, సదుపాయాలు సమకూర్చడం జరిగిందన్నారు. దివ్యంగుల పునరావాసం కోసం లకుడా ఖర్చు చేయడం జరుగుతోందన్నారు. దివ్యంగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా వేలాది మందికి ప్రత్యేక ఉపాధి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. పారా ఒలింపిక్స్ కొరకు దివ్యంగులను ప్రోత్సహిస్తున్నామన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో.. ‘ఆూ×వీజూ’ ఆధ్వర్యంలో వేలాది శిబిరాలు ఏర్పాటు చేసి నాణ్యమైన సహాయ ఉపకరణాలను అందివ్వడం జరిగిందన్నారు. గతంలో 80% కంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికి మాత్రమే మోటోరైస్డ్ ట్రై సైక్కిళ్ళు అందించడం జరిగేదని... ప్రస్తుతం దాన్ని 40% కు తగ్గించడం జరిగిందన్నారు. దివ్యంగుల అభివృద్ధి కోసం ఇంకా ఏదైనా మంచి చేయవచ్చో.. ఆలోచించి కార్యాచరణ చేపడతామన్నారు. జవాబుదారీ నాయకత్వాన్ని అందించిన ప్రజలకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని, సంతృప్త స్థాయిలో సంక్షేమ ఫలాలను అందించి.. వారి జీవన విధానాన్ని వికశింపజేయాలన్నారు. ప్రభుత్వం ద్వారా పేద ప్రజలకు అందుతున్న విద్య, వైద్యం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం మొదలైన అన్ని రకాల సాయాన్ని దివ్యంగులకు కూడా అందివ్వడం జరుగుతోందన్నారు. జిల్లాలో ఉన్న దివ్యంగులు అందరూ.. విడతల వారీగా ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, డిసేబుల్ శాఖ ఏడి కృష్ణ కిషోర్, సంక్షేమ అనుబంధ శాఖల అధికారులు, అనుబంధ శాఖల అధికారులు, లబ్ధిదారులు తదితరులు హాజరయ్యారు.



**అభిప్రాయాలు..**

**1) మా ఆశలకు రెక్కలొచ్చాయ్...**

అలవాటు పడిన అంగ వైకల్యంతో జీవించడం ఇబ్బంది కాకపోయినా.. స్వతహాగా ఇంకా ఏదో చేయాలన్న మా ఆశలకు రెక్కలు వచ్చినట్లుంది. పెన్షన్ తోపాటు ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తోంది. జిల్లా కలెక్టర్ వారి చొరవతో.. మోటరైజ్డ్ వాహనాలు సరఫరా చేయడం అభినందనీయం. ఈ స్కూటర్లను సొంతం చేసుకోవడం కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్నామనే.. ఉత్సాహాన్నిస్తోందన్నారు. ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ, లైసెన్స్ కూడా ఇచ్చి.. మా జీవన గమనానికి జిల్లా యంత్రాంగం వారధిగా నిలిచింది. ధన్యవాదాలు.

**- ప్రభావతి(అంగన్వాడీ టీచర్), ఎర్రిపల్లె, పులివెందుల.**

**2) జిల్లా యంత్రాంగం సహకారం మరువలేనిది..**

మా జీవితం ఇంతేలే.. అనే ఆలోచనలో ఉన్న మా లాంటి దివ్యంగులకు.. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం కేవలం సహాయం కాదు. మాకు ఓ కొత్త జీవితాన్నిస్తోంది. కుటుంబానికి ఆసరాగా నిలవాల్సిన నాకు.. ఏ పనైనా చేయగలిగే ధైర్యం ఉంది. సహకరించని శరీర అవయవాలతో.. అన్నింటిలోనూ వెనుకబడ్డాను. ఏ ఒక్కరికీ భారం కాకూడదని.. దేవుణ్ణి కోరుకునే నాకు.. ప్రభుత్వం అందించిన ఈ స్కూటర్ నా జీవితానికి చక్కటి దారి చూపుతుంది.

**- గంగాదేవి (ఔట్సోర్సింగ్ జాబ్), ప్రొద్దుటూరు.**

**3) ఎవరి సహకారం లేకుండా ముందుకు సాగగలను..!**

గతంలో జిల్లా కలెక్టర్ వారి చొరవతో.. సహాయ ఉపకరణాలు పొందాము. ఇపుడు ఉచిత మోటరైజ్డ్ వాహనం సదుపాయం ద్వారా మా జీవన గమనానికి చక్కటి దారి చూపించారు. ఇపుడు ఎవరి సహకారం లేకుండా.. మా కుటుంబానికి అవసరమైన అన్ని పనులు సునాయాసంగా చేసుకునే అవకాశం కలుగుతోంది. ఒకరి సహకారం లేకుండా నా పనులు స్వతహాగా చేసుకోగలనని నమ్మకం వచ్చింది. జిల్లా యంత్రాంగం కల్పించిన ఈ ఉచిత స్కూటర్ సదుపాయం మా కుటుంబానికి ఎంతో ఆసరాను అందిస్తుందని అధిస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్ వారికి కృతజ్ఞతలు.

- సాదక్ ఉన్నిసా (ప్రైవేట్ స్కూల్ టీచర్), తిప్పిరెడ్డిపల్లి, కమలాపురం.




**4) జిల్లా యంత్రాంగం సహకారం మరువలేనిది..**

ప్రభుత్వం దివ్యంగులకు అందిస్తున్న సహకారం కేవలం సహాయం కాదు. మాకు ఓ కొత్త జీవితాన్నిస్తోంది. కుటుంబానికి ఆసరాగా నిలవాల్సిన నాకు.. ఏ పనైనా చేయగలిగే ధైర్యం ఉంది. అంగ వైకల్యం కారణంగా ఎన్నో అవకాశాలను కోల్పోయానని బాధ పడేవాన్ని. ప్రభుత్వం ద్వారా జిల్లా అధికారులు మాలాంటి వారి పాలిట దైవంగా మరి మోటరైజ్డ్ స్కూటర్లను ఉచితంగా అందివ్వడంతో అందరితో సమానంగా ఏ పనైనా చేయగలం అన్న ధీమా కలుగుతోంది.

**- ఎం. వేమారెడ్డి (టైలర్), రైల్వే కొండాపురం.**

# జనం మెచ్చిన నాయకుడు.. అభివృద్ధికి నిలువుటద్దం

## ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్






మైదుకూరు. మహి న్యూస్. ఏప్రిల్ :29 : బ్రహ్మంగారిమఠం: జననేత అండగా ఉంటే.. ఆపదలో ఉన్న ప్రజలకు కొండంత భరోసా లభిస్తుందని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మరోసారి నిరూపించారు. కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం రేకులకుంట పంచాయతీలోని గొల్లపల్లి గ్రామస్తులు ఎదుర్కొంటున్న అతిపెద్ద త్రాగునీటి సమస్యకు ఆయన చొరవతో శాశ్వత పరిష్కారం లభించింది. గ్రామంలోని త్రాగునీటి మోటార్ మరమ్మతుకు గురై ప్రజలు అల్లాడుతున్న వైనాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన మరుక్షణమే ఆయన యుద్ధప్రాతిపదికన స్పందించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఏ ఒక్కరూ దాహంతో అలమటించకూడదన్న తన దృఢ సంకల్పంతో, వెంటనే సమస్యను పరిష్కరించాలని మండల శ్రేణులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు, టిడిపి మండల అధ్యక్షులు చెన్నుపల్లె సుబ్బారెడ్డి సూచనలతో, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి బుధవారం గొల్లపల్లిలో నూతన బోరును ఏర్పాటు చేయించారు. ఎంతో కాలంగా నీటి కోసం ఎదురుచూస్తున్న గ్రామస్తులకు ఈ నూతన బోరు ఒక ‘సంజీవని’లా మారి, వారి కష్టాలకు చరమగీతం పాడింది. సమస్యను విన్న వెంటనే స్పందించి, ప్రజల దాహార్తిని తీర్చిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కార్యదక్షతకు గ్రామస్తులు వేనోళ్ల కృతజ్ఞతలు తెలుపుతూ జేజేలు పలుకుతున్నారు. అంతేకాకుండా, ప్రజల సమస్యల పరిష్కారంలో తమ సాయశక్తులా కృషి చేస్తున్న కానాల మల్లికార్జున రెడ్డి వంటి నాయకులు ఉండటం గొల్లపల్లి గ్రామస్తుల అదృష్టమని, రాబోయే రోజుల్లో ఆయన మరింత ఎత్తుకు ఎదుగుతూ మరిన్ని సేవలు అందించాలని గ్రామస్థులు ఆకాంక్షిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రేకులకుంట పంచాయతీ నేడు అభివృద్ధి పథంలో దూసుకుపోతోందంటే అది కేవలం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చిత్తశుద్ధి, నిరంతర పర్యవేక్షణే కారణమని ప్రజలందరూ ముక్తకంఠంతో కొనియాడుతున్నారు. ప్రజా సమస్యల పట్ల ఇంతటి వేగంగా స్పందించే నాయకుడు ఉండటం నియోజకవర్గ ప్రజలు చేసుకున్న పుణ్యమని, మాట చెప్పడమే కాదు.. చేసి చూపడమే పుట్టా నైజంఅంటూ గొల్లపల్లి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ అద్భుతమైన అభివృద్ధిని చూసి నియోజకవర్గ ప్రజలందరూ “వావ్.. ఎమ్మెల్యే గారంటే ఇలా ఉండాలి” అని గర్వంగా చెప్పుకుంటున్నారు.

# స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని ప్రారంభించిన

## రాష్ట్ర డైరెక్టర్/ ఏఎంసీ చైర్మన్



రాజంపేట. మహి న్యూస్. ఏప్రిల్ :29: రాజంపేట మండలం. నియోజకవర్గ పార్టీ కార్యాలయం. రాజంపేట. చెత్త నుండి సంపద సృష్టించడం అనేది పర్యావరణాన్ని కాపాడమే కాకుండా ఆర్థిక లాభాలను కూడా చేకూరుస్తుందని క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నె సుబ్బనరసయ్య నాయుడు .తెలిపారు బుధవారం నాడు రాజంపేట మండలం బోయనపల్లె నందు నిర్వహించిన “స్వచ్ఛ పథం” కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు ఆదేశానుసారం ఇరువురు నాయకులు ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇరువురు నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త సేకరణ ద్వారా తడి చెత్తను. పొడి చెత్తను వేరు చేసి ఆ వ్యర్థాల నుంచి ఎరువులను తయారు చేసుకోవచ్చునన్నారు. అంతకుముందు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను క్లైప్ మిత్ర ద్వారా సేకరించి స్వచ్ఛ రథం ద్వారా చెత్త నుండి సంపద కేంద్రాలకు తరలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎంపీడీవో వరప్రసాద్ .పంచాయతీ కార్యదర్శులు. అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు.గొంటిముక్కల పెంచలరావు. మునక్కాయలపల్లె రమణ రాజు పలువురు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెనగలూరు మండలంలోఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆధ్వర్యంలో జనవని కార్యక్రమం



రైల్వే కోడూరు. మహి న్యూస్. ఏప్రిల్ :29 : రైల్వే కోడూరు నియోజకవర్గం జనవని కార్యక్రమంలో ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని సత్వర పరిష్కార దిశగా చర్యలు చేపట్టిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పెనగలూరు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణ నందు గౌరవ ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నిర్వహించిన “జనవని” కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ప్రజల నుండి నేరుగా అర్జీలను అందుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు అనంతరం వచ్చిన పలు సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. గ్రామస్తులు రోడ్లు,భూ సమస్యలు, తాగునీటి సమస్యలు, పంట నీటి ఇబ్బందులు వంటి వివిధ అంశాలను ప్రతిపాదించారు. అధికారులు ప్రతి సమస్యను నమోదు చేసి, వెంటనే పరిష్కారం కోసం చర్యలు ప్రారంభించారు. ప్రతి సమస్యపై సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ, త్వరితగతిన పరిష్కారం కల్పించాలని సూచించారు. అలాగే జనసేన రాష్ట్ర కార్యదర్శి తతంశెట్టి నాగేంద్ర కూడా పాల్గొని ప్రజల సమస్యలపై స్పందించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అధికారులు పనిచేయాలని, సమస్యలు ఆలస్యం లేకుండా పరిష్కరించాలని అరవ శ్రీధర్ కోరారు.ఈ సందర్భంగా అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జనవని కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలకు తక్షణ స్పందన లభించడం పట్ల గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర , మార్కెట్ కమిటీ చైర్మన్ పగడాల వరలక్ష్మి ఎన్. డి. ఏ కూటమి నాయుకులు పాల్గొన్నారు.



EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPADIST, A.PPRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com